www.udyamakeratam.com

RNI: TGTEL/25/A0273

1వ వార్షికోత్సవం

# ఉద్యమ కెరటం

నిజం రక్షతి రక్షిత:

UDYAMA KERATAM TELUGU DAILY

తెలుగు దినపత్రిక

| ఆసిఫాబాద్ | | సంపుటి: 2 | | సంచిక: 126 | | 28-10-2026 | | బుధవారం | | పేజీలు: 8 | | వెల : రూ.2/-

## గ్లోబల్ సమ్మిట్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- నవంబర్ మొదటి వారంలోగా ప్రణాళికలు ఖరారు
- డిసెంబర్ 7 నుంచి ఫ్యూచర్ సిటీలో సదస్సు
- హైదరాబాద్ అంతటా ప్రచార కార్యక్రమాలు
- తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించేలా డిజైన్లు
- ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి




3

## 550 దిగ్గజ సంస్థలకు ఆహ్వానాలు



- ఢిల్లీలో 29న గ్లోబల్ సమ్మిట్ కర్టెన్ రైజర్
- ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్‌కు 550కిపైగా దిగ్గజ కంపెనీలకు ఆహ్వానం

3



## రాష్ట్రంలో 365 మండలాలకు

# కరువు సెగ

- 111 మండలాల్లో తీవ్ర కరువు
- మరో 254 మండలాల్లో మోస్తరు ప్రభావం
- సాధారణం కంటే 17 శాతం తక్కువ వర్షపాతం
- రైతులకు సాయం.. తాగునీరు, పశుగ్రాసంపై ప్రత్యేక దృష్టి

**హైదరాబాద్, అక్టోబర్ 27:** తెలంగాణలో వర్షాభావ పరిస్థితులు వ్యవసాయంపై తీవ్ర ప్రభావం చూపుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2026 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 31 జిల్లాల్లోని 365 మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించింది. ఇందులో 111 మండలాల్లో తీవ్ర కరువు పరిస్థితులు ఉండగా, 254 మండలాల్లో మోస్తరు ప్రభావం ఉన్నట్లు గుర్తించింది. ఈ మేరకు రెవెన్యూ (విపత్తుల నిర్వహణ-2) శాఖ జీఓ ఎంఎస్ నం.3 జారీ చేసింది. కరువు ప్రభావిత ప్రాంతాల్లో తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్లను ఆదేశిస్తూ ప్రభుత్వ

మిగతా 2వ పేజీలో..



### ఎల్‌నినో, కరువు పరిస్థితులపై

## నేడు అఖిలపక్షం

- భట్టి విక్రమార్క అధ్యక్షతన సమావేశం
- వర్షపాతం లోటు, తాగునీరు, సాగునీరు మరియు విద్యుత్ సరఫరాపై ప్రధాన చర్చ
- ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికపై రాజకీయ పార్టీల నుంచి సలహాల స్వీకరణ

2



## యాసంగిలో వరి సాగు చేయొద్దు

- ప్రస్తుత పంటలను కాపాడాలి
- తాగునీటి అవసరాలకు తొలి ప్రాధాన్యం
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల
- ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధికారులతో సమీక్ష

2

## కాంగ్రెస్ నిర్లక్ష్యంతోనే కరువు



- కాళేశ్వరం ఆన్ చేయకుండా పంటలను ఎండబెట్టారు
- రేవంత్ కేవలం రెన్యువల్ సీఎం
- కాంగ్రెస్ దోపిడీకి వేదికగా తెలంగాణ
- 11న నిర్మల్ లో భారీ బహిరంగ సభ
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్, అక్టోబర్ 27 :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసమర్థ పాలన, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొన్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. సాగునీటి కొరత, విద్యుత్ సమస్యలు, యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నదుల్లో నీళ్లు పారుతున్నా వాటిని సాగుకు వినియోగించుకోకుండా సముద్రంలోకి వదిలేస్తున్నారని, అందుబాటులో ఉన్న నీటిని రైతులకు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. తెలంగాణ భవన్‌లో నిర్మల్ నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ నాయకులు బీఆర్ఎస్‌లో మంగళవారం చేరిన సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వస్తాయా, కేసీఆర్‌ను తిరిగి

మిగతా 3వ పేజీలో..




### ఎస్ఐఆర్‌పై ఈసీ అఫిడవిట్..

## పది రోజుల గడువు

- ఈసీ అఫిడవిట్‌పై సమాధానానికి సుప్రీంకోర్టు ఆదేశం
- ఎస్ఐఆర్ చట్టబద్ధమేనని ఎన్నికల సంఘం స్పష్టీకరణ
- బిహార్‌లో ఫారం-6 మార్పులపై మరో పిటిషన్
- ఎన్నికల సంఘానికి ధర్మాసనం నోటీసులు

4

## సాంకేతిక ఆవిష్కరణల్లో భారత్‌దే నాయకత్వం

- అనుసరించే స్థాయి నుంచి సృష్టించే స్థాయికి
- యువ ఆవిష్కర్తల ఆత్మవిశ్వాసంపై మోదీ ప్రశంసలు
- ప్రపంచ సమస్యలకు స్వదేశీ పరిష్కారాలు
- 2.5 లక్షలకు చేరిన స్టార్టప్‌లు.. ఇన్నోవేషన్ సూచీలో మెరుగైన ర్యాంకు

4

## కాంగ్రెస్ పాలనలో చస్తేనే పనులవుతాయా?

- సివిల్ సప్లైస్ కార్పొరేషన్‌ను రూ. లక్ష కోట్ల అప్పుల్లో ముంచారు
- బిల్లుల కోసం చచ్చిపోవడానికి సిద్ధమని కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డే అన్నారు
- రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు రాజునుంచి అదేమాట
- మినీ సూపర్ మార్కెట్ల ఊసేలేదు
- అసెంబ్లీ, కౌన్సిల్ వేదికగా ప్రభుత్వాన్ని నిలదీస్తాం
- మాజీ మంత్రి హరీష్‌రావు

**సిద్దిపేట, అక్టోబర్ 27:** అసలు రాష్ట్రంలో పరిస్థితి ఎంత దారుణంగా మారిందంటే.. చచ్చిపోతేనే పనులు అవుతాయా? చచ్చిపోతేనే బిల్లులు వస్తాయా? అధికార పార్టీ ఎమ్మెల్యేనే చచ్చిపోవడానికి సిద్ధమనే దుస్థితి వచ్చింది. కానీ ఎవరూ చచ్చిపోవద్దు, అందరూ బాగుండాలి. పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్లు తప్ప.. అందరం కలిసి గట్టిగా కొట్లాడి బిల్లులు, డీలర్ల కమీషన్ సాధించుకుందామని బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు పిలుపునిచ్చారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్‌లో మంగళవారం

మిగతా 2వ పేజీలో..





## ఆరోగ్యమే విలువైన సంపద

- ఆయుర్వేద వారసత్వాన్ని పరిరక్షించుకోవాలి
- సంప్రదాయ వైద్యానికి శాస్త్రీయ పరిశోధనలు తోడవ్వాలి
- కనక్పూర్ శ్రీ ధన్వంతరి ఆలయంలో మహాయాగం
- హాజరైన డిప్యూటీ సీఎం భట్టి

2

## తీరు మారకుంటే కఠిన చర్యలే

- భూ సమస్యల పరిష్కారంలో జాప్యాన్ని సహించను
- సర్వేను పరిశీలించి భూమి విస్తీర్ణంపై రైతులకు స్పష్టత ఇవ్వాలి
- పెండింగ్ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలి
- రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి

3





## మందుల ధరలపై సుప్రీంకోర్టు ఆగ్రహం

- రూ.11 వేల మందు రూ.1.30 లక్షలకు విక్రయం
- రూ.15 డ్రిప్ లైన్ ధర రూ.250
- ఎన్‌పీపీఏ పనితీరుపై ధర్మాసనం అసంతృప్తి
- రోగుల ప్రయోజ్యాల కంటే వ్యాపారాలకే ప్రాధాన్యమా?

4

## సివిల్ వివాదంలో లంచం బాగోతం

- రూ.10 లక్షలు డిమాండ్.. రూ.6 లక్షలకు బేరం
- రూ.3 లక్షలు తీసుకుంటుండగా ఏసీబీ దాడి
- మీర్‌చౌక్ ఇన్‌స్పెక్టర్, కానిస్టేబుల్ పట్టివేత

2

ఉద్యమ కెరటం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
బుధవారం 28 అక్టోబర్ 2026

## ఎల్‌నినో, కరువు పరిస్థితులపై నేడు అఖిలపక్షం

- భట్టి విక్రమార్క అధ్యక్షతన సమావేశం
- వర్షపాతం లోటు, తాగునీరు, సాగునీరు మరియు విద్యుత్ సరఫరాపై ప్రధాన చర్చ
- ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికపై రాజకీయ పార్టీల నుంచి సలహాల స్వీకరణ

**హైదరాబాద్, అక్టోబర్ 27 :**

రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం లోటు, కరువు పరిస్థితులపై చర్చించేందుకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహిస్తోంది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన మధ్యాహ్నం 2.30 గంటలకు సచివాలయంలో ఈ సమావేశం జరగనుంది. రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులు, వర్షపాతం లోటు నేపథ్యంలో ప్రజలు, రైతులపై పడే ప్రభావాన్ని తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించనున్నారు. తాగునీటి సరఫరా, నీటి వనరుల పరిరక్షణ, సాగునీటికి విద్యుత్ సరఫరా, ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక వంటి కీలక అంశాలపై రాజకీయ పార్టీల నేతల నుంచి సలహాలు, సూచనలు స్వీకరిస్తారు. కరువు నివారణకు అనుసరించాల్సిన వ్యూహాలు, అవసరమైన ముందస్తు చర్యలపై అఖిలపక్ష నేతల అభిప్రాయాలను ప్రభుత్వం తెలుసుకోనుంది. రాష్ట్రంలో కరువు పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్ని పార్టీలు సహకరించాలని ప్రభుత్వం కోరుతోంది.

## ఆరోగ్యమే విలువైన సంపద

**కనక్కూర్, అక్టోబర్ 27 :**

ఆరోగ్యమే మానవ జీవితంలో అత్యంత విలువైన సంపద అని, భారతీయ ఆయుర్వేద వారసత్వాన్ని పరిరక్షిస్తూ శాస్త్రీయ పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. కేరళంలోని కనక్కూర్ శ్రీ ధన్వంతరి ఆలయంలో మంగళవారం నిర్వహించిన ధన్వంతరి మహాయాగానికి హాజరైన ఆయన ఆరోగ్య పరిరక్షణ, ఆయుర్వేద ప్రాధాన్యత, ప్రజారోగ్యం, సామాజిక బాధ్యతలపై ప్రసంగించారు. ఆరోగ్యం అంటే వ్యాధులు లేకపోవడం మాత్రమే కాదని, శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, భావోద్వేగ స్థిరత్వం, సంతృప్తికరమైన జీవితం కూడా అందులో భాగమేనని అన్నారు. నేటి వేగవంతమైన జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిళ్లను ఎదుర్కొనేందుకు ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ శ్రద్ధ చూపాలని సూచించారు. ధన్‌తేరస్‌ను బంగారం కొనుగోలు చేసే పర్వదినంగానే కాక ధన్వంతరి జయంతిగా దాని అసలైన ప్రాముఖ్యతతో గుర్తించాలన్నారు. పాల సముద్ర మథనంలో అమృత కలశంతో ఆవిర్భవించిన దేవతల వైద్యుడు భగవాన్ ధన్వంతరి ఆరోగ్యం, జీవరక్షణకు ప్రతీకగా నిలుస్తారని భట్టి పేర్కొన్నారు. ధన్వంతరిని ఆరాధించడం వ్యక్తిగత ఆరోగ్యానికే కాక కుటుంబ, సమాజ శ్రేయస్సుకు కూడా ప్రతీక అని వివరించారు.

**ఆయుర్వేదంలో కేరళం ప్రత్యేకం**

భారతీయ వైద్య వారసత్వంలో ఆయుర్వేదానికి విశిష్ట స్థానం ఉందని, ఔషధ మొక్కలపై సంప్రదాయ పరిజ్ఞానం, ప్రత్యేక చికిత్సా విధానాలతో కేరళం దేశవిదేశాల్లో గుర్తింపు పొందిందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ ఆలయంలో 11 రోజులపాటు నిర్వహిస్తున్న ధన్వంతరి మహాయాగం ఆరోగ్య ప్రాధాన్యతను, భారతీయ వైద్య సంప్రదాయాల గొప్పతనాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి దోహదపడుతుందని అన్నారు. వ్యాధుల చికిత్సతోపాటు నివారణ, సమతుల్యమైన జీవనశైలి, సరైన ఆహారం, ప్రకృతితో సామరస్యంగా జీవించడం వంటి అంశాలకు సంప్రదాయ వైద్య విధానాలు ప్రాధాన్యత నిచ్చాయని గుర్తు చేశారు. అయితే ఆయుర్వేదాన్ని ఆచరిస్తూ శాస్త్రీయ పరిశోధనలను ప్రోత్సహించాలని, రోగులకు సురక్షితమైన వైద్య సేవలు అందేలా చూడాలని స్పష్టం చేశారు.

**ప్రజారోగ్యమే అభివృద్ధికి ప్రాధాన్యం**

ప్రజల ఆరోగ్యం, సంక్షేమం అభివృద్ధి విధానాల్లో ప్రధానంగా ఉండాలన్నారు. హాస్పిటల్స్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, వైద్య విద్య, పరిశోధన, వ్యాధుల నివారణ, ప్రజారోగ్య అవగాహన కార్యక్రమాలకు నిరంతర పెట్టుబడులు అవసరమని పేర్కొన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి, వైద్య ఖర్చులు భరించలేని కుటుంబాలకు సమాజం అండగా నిలవాలని పిలుపునిచ్చారు. వృద్ధులు, దివ్యాంగులు, బలహీనవర్గాల పట్ల సానుభూతితో వ్యవహరించాలని, ప్రాణాలను కాపాడేందుకు నిరంతరం శ్రమిస్తున్న వైద్యులు, పరిశోధకులు, ఆరోగ్య కార్యకర్తల సేవలను గౌరవించాలని సూచించారు. మన్నత్తు పద్మనాభన్, శ్రీ నారాయణ గురు, అయ్యంకాళి వంటి సామాజిక సంస్కర్తలు సమాజంలో జ్ఞానాన్ని విస్తరించేందుకు, ప్రతి ఒక్కరూ ఆత్మగౌరవంతో జీవించేలా కృషి చేశారని భట్టి విక్రమార్క గుర్తు చేశారు. నాయర్ సర్వీస్ సొసైటీ చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను గౌరవిస్తూనే యువతలో శాస్త్రీయ దృక్పథం, నూతన ఆవిష్కరణలు, ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించాలని సూచించారు. ఆరోగ్యం పర్యావరణంతో ముడిపడి ఉందని, అడవులు, ఔషధ మొక్కలు, స్వచ్ఛమైన నీరు, జీవవైవిధ్యాన్ని కాపాడుకోవడం భావితరాల శ్రేయస్సుకు అవసరమని అన్నారు. దేశంలో శాంతి, సమాజంలో సామరస్యం నెలకొనాలని, ప్రతి కుటుంబం ఆరోగ్యంగా, సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. ధన్వంతరి మహాయాగ నిర్వాహకులు, ఆలయ అధికారులు, స్వచ్ఛంద సేవకులు, మొదటగా విచ్చేసిన భక్తులందరికీ డిప్యూటీ సీఎం మలయాళంలో శుభాకాంక్షలు తెలిపారు.

## సివిల్ వివాదంలో లంచం బాగోతం

- రూ.10 లక్షలు డిమాండ్.. రూ.6 లక్షలకు బేరం
- రూ.3 లక్షలు తీసుకుంటుండగా ఏసీబీ దాడి
- మీర్‌చౌక్ ఇన్‌స్పెక్టర్, కానిస్టేబుల్ పట్టివేత
- పోలీస్ స్టేషన్‌లో ఏసీబీ సోదాలు

**హైదరాబాద్, అక్టోబర్ 27:**

సివిల్ వివాదాన్ని పరిష్కరిస్తామంటూ లంచం డిమాండ్ చేసిన మీర్‌చౌక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కొండల్‌రావు, ఓ కానిస్టేబుల్ ఏసీబీ వలకు చిక్కారు. బాధితుడి నుంచి రూ.3 లక్షలు తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ అధికారులు వారిని పట్టుకున్నారు. ఈ ఘటన పోలీసు శాఖలో కలకలం రేపింది.

పోలీసు వర్గాలు, ఏసీబీ వివరాల ప్రకారం.. పాతబస్తీ పరిధిలోని ఓ స్థలానికి సంబంధించి తలెత్తిన సివిల్ వివాదంలో ఇన్‌స్పెక్టర్ కొండల్‌రావు జోక్యం చేసుకున్నారు. సమస్యను అనుకూలంగా పరిష్కరిస్తానంటూ బాధితుడి నుంచి తొలుత రూ.10 లక్షలు డిమాండ్ చేశారు. అంత మొత్తం చెల్లించలేనని బాధితుడు చెప్పడంతో చివరకు రూ.6 లక్షలకు ఒప్పందం కుదిరింది. ఇందులో భాగంగా మొదటి విడతగా రూ.3 లక్షలు ఇవ్వాలని ఇన్‌స్పెక్టర్ కోరినట్లు సమాచారం. లంచం డిమాండ్‌తో విసిగిపోయిన బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచన మేరకు మంగళవారం మీర్‌చౌక్ పరిధిలోని ఓ దుకాణంలో రూ.3 లక్షల నగదును అందిస్తుండగా అధికారులు దాడి చేశారు. నగదు స్వీకరిస్తున్న ఇన్‌స్పెక్టర్ కొండల్‌రావుతో పాటు ఈ వ్యవహారంతో సంబంధమున్న కానిస్టేబుల్‌ను అదుపులోకి తీసుకున్నారు.

అనంతరం మీర్‌చౌక్ పోలీస్ స్టేషన్‌లో ఏసీబీ బృందాలు సోదాలు నిర్వహించాయి. కేసు నమోదు చేసిన అధికారులు, నిందితులను ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు వెల్లడించారు.



# యాసంగిలో వరి సాగు చేయొద్దు

**ఖమ్మం, అక్టోబర్ 27:**

ఎల్నినో ప్రభావం వల్ల వొచ్చే కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుత వానాకాలం పంటను కాపాడుకోవాలని, రాబోయే యాసంగిలో వరి సాగుకు బదులు తక్కువ నీటితో పండే పంటలను సాగు చేసేలా రైతులను సన్నద్ధం చేయాలి వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఖమ్మం కలెక్టరేట్లో కలెక్టర్లు దివాకర టిఎస్, అంకిత్లతో కలిసి మంత్రి తుమ్మల ఎల్నినో పరిస్థితులపై సమీక్షించారు. ఈ సందర్భంగా నీటి పారు దల, మిషన్ భగీరథ, వ్యవసాయం, భూగర్భజలాలు, మార్కెటింగ్, విద్యుత్, వైద్యారోగ్య శాఖల అధికారులు తమ శాఖల ప్రస్తుత పరి స్థితులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వా రా వివరించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ రువు పరిస్థితులు,
మండలాల వారీగా భూగర్భ జలాలు తగ్గుతున్న తీరుపై ప్రజలకు స్పష్టమైన సమా చారం అందించాలని అన్నారు. ఈ నెలాఖ రు నాటికి, వచ్చే నెలలో భూగర్భ జలాల పరిస్థితి ఎలా ఉండబోతుందనే అంచనాలను ప్రజలకు వివరించాలని, ప్రజలను అప్ర మత్తం చేయాలని సూచించారు.

**యాసంగిలో సాగునీటి లభ్యత లేదు**

రాబోయే యాసంగి సీజన్లో సాగునీటి లభ్యత ఉండే అవకాశం లేదని మంత్రి తుమ్మల తెలిపారు. రైతులు అధిక నీరు అవ సరమయ్యే వరి సాగుకు దూరంగా ఉండా లని, పప్పు ధాన్యాలు, చిరు ధాన్యాలు, కూర గాయలు, ఇతర తక్కువ నీటితో పండే పంట లను సాగు చేయాలని సూచించారు. ఎక్క డా పంట వ్యర్థాలను తగులబెట్టకుండా చూడాలని, పంట వ్యర్థాలు తగులబెట్టిన ఘటనలు చోటుచేసుకుంటే సంబంధిత అధి కారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చ రించారు. ఎల్నిన్నా పరిస్థితుల నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటిని త్రాగునీటి అవ సరాలకు ప్రాధాన్యతనిస్తూ వినియోగించుకోవాలని మంత్రి సూచించారు. త్రాగునీటిని వాహనాల శుభ్రత, తోటల పెంపకం వంటి అవసరాలకు వినియోగించకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. నాగార్జు నసాగర్ పరిధిలోని రెగ్యులేటర్లు, షట్టర్లు, పంపిణీ వ్యవస్థలను మూసివేసి, పాలేరు వర కు ప్రధాన కాలువల్లో నీటిని నిల్వ ఉంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సీతా రామ ప్రాజెక్టు ప్రధాన కాలువలో మూడు పంప్ హౌస్లను వినియోగించి సాధ్యమైనం త ఎక్కువ నీటిని నిల్వ చేయాలని తెలిపారు. పాలేరు రిజర్వాయర్ మూడు జిల్లాల త్రాగు నీటి అవసరాలకు ఉపయోగపడేలా చూడా లన్నారు. దుమ్ముగూడెం టెయిల్పాండ్ సమీపంలో ఇసుక బస్తాలతో అడ్డుకట్టను పెంచి సుమారు 1 టీఎంసీ నీటిని నిల్వ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

**పత్తి, ధాన్యం కొనుగోళ్లను పర్యవేక్షించాలి**

పత్తి, ధాన్యం కొనుగోళ్లను పర్యవేక్షించాలని మంత్రి అధికారులు ఆదేశించారు. బ్లాక్ మార్కెటింగ్, సిండికేట్లు ఏర్పడకుండా మా ర్కెటింగ్ శాఖ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యుత్ను పొదుపుగా విని యోగించాలని మంత్రి సూచించారు. వ్యవ సాయ విద్యుత్ సరఫరా సమయాలపై రైతు లకు ముందుగానే సమాచారం అందించా లని, మోటార్లకు ఏర్పాటు చేసిన ఆటో స్టార్టర్లను తొలగించాలని ఆదేశించారు. ఎండిపోయిన బోర్లను వినియోగించకుండా. చూడాలని తెలిపారు. మున్సిపాలిటీలు, గ్రామాల్లో వీధి దీపాలను దశలవారీగా సౌర విద్యుత్తో నిర్వహించే అవకాశాలను పరిశీ లించాలని సూచించారు. నీరు, విద్యుత్ వృథాను అరికట్టేందుకు ప్రజల్లో అవగాహన. కల్పించాలని అన్నారు. 1986లో సుమారు 600 గ్రామాలు వరదల కారణంగా ముం పునకు గురైన సమయంలో ప్రజలకు ఆహా రం. త్రాగునీరు అందించి అధికారులు సమ రంగా పనిచేశారని మంత్రి గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో ప్రస్తుత పరిస్థితుల్లోనూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సుడా చైర్మ న్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, జిల్లా గ్రం థాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, ఉఅధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో 365 మండలాలకు కరువు సెగ

**మొదటిపేజీ తరువాయి**

ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

జూన్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు రాష్ట్రంలో 615.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సాధారణంగా ఈ వ్యవధిలో 740.6 మిల్లీమీటర్లు కురవాల్సి ఉండగా, 17 శాతం లోటు ఏర్పడింది. దీర్ఘకాలికంగా నెలకొన్న పొడి వాతావరణం, నేలలో తేమ తగ్గడం కూడా కరువు తీవ్రతకు కారణమయ్యాయి. ఈ పరిస్థితుల ప్రభావంతో ఖరీఫ్ సాగు విస్తీర్ణం 139.28 లక్షల ఎకరాల నుంచి 126.06 లక్షల ఎకరాలకు తగ్గింది. మొత్తంగా 13.22 లక్షల ఎకరాల్లో సాగు తగ్గినట్లు ప్రభుత్వం గుర్తించింది. వరి సాగు విస్తీర్ణం 69.19 లక్షల ఎకరాల నుంచి 57 లక్షల ఎకరాలకు పడిపోయింది. ఇది 18 శాతం తగ్గుదలకు సమానం. రాష్ట్రంలోని ప్రధాన, మధ్యతరహా ప్రాజెక్టుల్లో ప్రస్తుతం 179.63 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. ఈ ప్రాజెక్టుల మొత్తం సామర్థ్యం 585 టీఎంసీలు. నీటి నిల్వలు తగ్గడం వల్ల తాగునీరు, వ్యవసాయం, పశుసంపద, విద్యుత్ అవసరాలపై ప్రభావం పడే ప్రమాదం ఉందని ప్రభుత్వం పేర్కొంది.

శాస్త్రీయ ప్రమాణాల ఆధారంగా కరువు మండలాలను గుర్తించినట్లు ఉత్తర్వుల్లో వివరించారు. వర్షపాతం గణాంకాలతోపాటు సాగు విస్తీర్ణంలో మార్పులు, రిమోట్ సెన్సింగ్ ద్వారా గుర్తించిన వృక్ష సంపద పరిస్థితి, నేలలో తేమ, భూగర్భ జలాల స్థాయిని పరిగణనలోకి తీసుకున్నారు. ప్రతి మండలంలోని 10 శాతం గ్రామాల్లో క్షేత్రస్థాయి పరిశీలనలు నిర్వహించారు. కలెక్టర్ల ప్రతిపాదనలు, వివిధ శాఖల నివేదికలను పరిశీలించిన అనంతరం అక్టోబర్ 23న జరిగిన కేబినెట్ ఉపసంఘం సమీక్షలో 365 మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించాలని సిఫారసు చేసింది. దీంతో ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది.

కరువు మండలాల్లో తాగునీటి సరఫరాను మెరుగుపరచడం, పశుగ్రాసం అందుబాటులో ఉంచడం, అవసరమైన చోట పశువుల శిబిరాలు ఏర్పాటు చేయడం, ఉపాధి అవకాశాలు కల్పించడంపై దృష్టి పెట్టాలని కలెక్టర్లను ఆదేశించింది. అర్హులైన రైతులకు వ్యవసాయ పెట్టుబడి సాయాన్ని నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేసేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖకు సూచించింది. జాతీయ విపత్తు స్పందన నిధి (ఎన్‌డీఆర్‌ఎఫ్) నుంచి కేంద్ర సాయం అందిన తేదీ నుంచి నెలలోపు ప్రభావిత రైతులకు పెట్టుబడి సాయం పంపిణీ చేయాలని పేర్కొంది. లబ్ధిదారుల జాబితాలను జిల్లా కలెక్టర్ల వెబ్‌సైట్లతోపాటు రాష్ట్ర ప్రభుత్వ వెబ్‌సైట్‌లోనూ ప్రచురించాలని ఆదేశించింది.

కేంద్రం నుంచి ఆర్థిక సాయం కోరేందుకు అవసరమైన వివరాలతో ఏడు రోజుల్లో మెమోరాండం సిద్ధం చేయాలని ప్రణాళిక శాఖను ప్రభుత్వం ఆదేశించింది. వ్యవసాయ రుణాల పునర్వ్యవస్థీకరణ, రుణ వసూళ్లలో బలవంతపు చర్యలు నివారించే అంశాలపై రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీతో సంప్రదించాలని కలెక్టర్లకు సూచించింది. కరువు ప్రకటన జారీ చేసిన తేదీ నుంచి ఆరు నెలలపాటు అమల్లో ఉంటుంది. అంతకుముందే ఉపసంహరించకపోతే ఈ గడువు కొనసాగుతుంది. జాబితాలో లేని మండలాల్లో పరిస్థితులను రాష్ట్ర కరువు పర్యవేక్షణ కేంద్రం పరిశీలిస్తుందని, అవసరమైతే అదనపు నోటిఫికేషన్ ద్వారా మరిన్ని మండలాలను చేర్చవచ్చని ప్రభుత్వం స్పష్టం చేసింది.



**జిల్లాల వారీగా కరువు ప్రభావిత మండలాల సంఖ్య ఇలా ఉంది:**

ఆదిలాబాద్ 20, భద్రాద్రి కొత్తగూడెం 16, హనుమకొండ 14, జగిత్యాల 3, జనగాం 4, జయశంకర్ భూపాలపల్లి 5, జోగులాంబ గద్వాల 13, కామారెడ్డి 4, కరీంనగర్ 3, ఖమ్మం 17, కుమురం భీం ఆసిఫాబాద్ 5, మహబూబాబాద్ 7, మహబూబ్‌నగర్ 13, మంచిర్యాల 11, మెదక్ 1, మేడ్చల్‌మల్కాజిగిరి 9, ములుగు 4, నాగర్‌కర్నూల్ 13, నల్గొండ 28, నారాయణపేట 13, నిర్మల్ 9, నిజామాబాద్ 18, రాజన్న సిరిసిల్ల 2, రంగారెడ్డి 18, సంగారెడ్డి 28, సిద్దిపేట 8, సూర్యాపేట 23, వికారాబాద్ 20, వనపర్తి 11, వరంగల్ 8, యాదాద్రి భువనగిరి 17.

మొత్తంగా 31 జిల్లాల్లోని 365 మండలాలు కరువు ప్రభావిత ప్రాంతాల జాబితాలో చేరాయి.

# కాంగ్రెస్ పాలనలో చస్తేనే పనులవుతాయా?

**మొదటిపేజీ తరువాయి**

నిర్వహించిన రాష్ట్రవ్యాప్త రేషన్ డీలర్ల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డీలర్ల సమస్యలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయికోటి రాజును గత 25 ఏళ్లుగా చూస్తున్నా. ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్నప్పటి నుంచి సునీతా లక్ష్మారెడ్డిని, పద్మా దేవేందర్ రెడ్డిని, ఇప్పుడు గూడెం మహిపాల్ రెడ్డిని గౌరవ అధ్యక్షుడిగా పెట్టుకుని డీలర్ల సమస్యల పరిష్కారం కోసం ఎవరిని ఎలా ఒప్పించాలో తెలిసిన నేర్పరి. అయితే ఈరోజు వేదిక మీద రాజు మాట్లాడుతూ డీలర్ల సమస్యలు పరిష్కారం కాకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తా, ప్రాణత్యాగానికైనా సిద్ధం అనడం తనను కదిలించిందన్నారు. నిన్ననే జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే, డీలర్ల సంఘం గౌరవ అధ్యక్షుడు అనిరుధ్ రెడ్డి కూడా మంత్రుల నియోజకవర్గాలకే నిధులు పోతున్నాయి, జడ్చర్లలో రోడ్లు పగుళ్లు పడ్డా రూ.3040 కోట్ల బిల్లులు రావడం లేదు, ఒక కాంట్రాక్టర్ చనిపోతేనే రూ.5 కోట్ల బిల్లు పడింది, నేను చచ్చిపోతేనే మా నియోజకవర్గ బిల్లులు వస్తాయంటే ప్రాణత్యాగానికి సిద్ధం అని ఆవేదన వ్యక్తం చేసిన సంగతి గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే తెల్లారే హామీలు అమలు చేయమని డీలర్లు అడగలేదు. కొత్త ప్రభుత్వం కుదురుకోవడానికి ఏడాది, రెండేళ్లు, మూడేళ్లు ఓపికగా ఎదురుచూశారు. కానీ మూడేళ్లు గడిచినా డీలర్ల వైపు కన్నెత్తి చూసే నాథుడే లేడన్నారు. కనీసం సివిల్ సప్లైస్ కమిషనర్ గానీ, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గానీ అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదని అధ్యక్షుడు రాజు బాధపడుతున్నారు. రేవంత్ రెడ్డి తమది ప్రజా ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకుంటారు. ప్రజలను ఎప్పుడైనా కలిసేదే ప్రజా ప్రభుత్వం కదా! మరి 17,200 మంది రేషన్ డీలర్లు ఎన్నుకున్న రాష్ట్ర అధ్యక్షుడికే మూడేళ్లలో అపాయింట్‌మెంట్ దొరకకపోతే ఇదెక్కడి ప్రజాపాలన అని ప్రశ్నించారు. నాడు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాజు, నందయ్య తదితరులు వస్తే సచివాలయంలో రెండు రోజులపాటు కూర్చోబెట్టి భోజనం పెట్టి నాటి మంత్రి గంగుల కమలాకర్ తో కలిసి అధికారులను, కేసీఆర్ ను ఒప్పించి కమిషన్‌ను రూ. 140 కి పెంచాం. ఆ రోజు బయట ప్రెస్ మీట్ పెట్టిన ఇదే ఉత్తమ్ కుమార్ రెడ్డి రూ.140 ఏం చాలుతాయి, కనీసం రూ.300 ఇవ్వాలి అని మాట్లాడారని గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో ఒక్కో డీలర్ వందలాది ఓట్లు వేయిస్తాడని జగిత్యాల డీసీసీ అధ్యక్షుడు నందయ్య, జీవన్ రెడ్డి వెళ్లి మేనిఫెస్టో కమిటీ చైర్మన్ శ్రీధర్ బాబుకు చెప్పి కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టించారు. నెలకు రూ.5,000 గౌరవ వేతనం, క్వింటాలుకు రూ.300 కమీషన్, రేషన్ షాపులను మినీ సూపర్ మార్కెట్లుగా మార్చి అన్ని వస్తువులు అమ్ముకునే అనుమతి ఇస్తామని నమ్మబలికారు. ఆ మాటలు నమ్మి డీలర్లందరూ కాంగ్రెస్‌కు పనిచేసి, ఓట్లు వేయించి గెలిపించారు. ఇవాళ డీలర్లు కొత్త డిమాండ్లేమీ పెట్టడం లేదు.. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన ఆ మూడు హామీలనే అమలు చేయమని అడుగుతున్నారు. చచ్చుడో.. తెలంగాణ వచ్చుడో అని కేసీఆర్ కొట్లాడి తెలంగాణ సాధించిన గజ్వేల్ గడ్డ మీద సమావేశం పెడితేనే ప్రభుత్వ పెద్దలకు సురుకు తగిలి కదలిక వస్తుందని ఇక్కడి నుంచే డీలర్లు సమరశంఖం పూరించారు. పేద ప్రజలందరికీ కడుపునిండా అన్నం పెడుతున్న రేషన్ డీలర్ల కడుపు మాత్రం కాంగ్రెస్ పాలనలో ఎండిపోతోంది. నాడు కేసీఆర్ పేదవాడు కడుపు నిండా తినాలని మనిషికి 4 కిలోల బియ్యాన్ని 6 కిలోలకు పెంచి, కార్డుకు 20 కిలోల సీలింగ్ ఎత్తేశారు. ఇంట్లో 10 మంది ఉంటే 60 కిలోల బియ్యం ఇచ్చారు. ఇవాళ డీలర్లకు రూపాయి కమిషన్ పెరగలేదు గానీ, నిత్యావసర వస్తువుల ధరలు మాత్రం ఆకాశాన్నంటాయి. మంచినూనె రూ. 210, కందిపప్పు రూ. 175, పెసరపప్పు రూ. 130, ఉల్లిగడ్డ రూ. 60 కి చేరింది, ఎల్లిగడ్డ ధర కొండెక్కింది. పన్నులు, అధికారుల వేధింపులు పెరిగిపోయి డీలర్లు కుటుంబాలను వెళ్లదీయలేని దుస్థితి నెలకొంది. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శాఖ పనితీరు ఎంత అధ్వాన్నంగా ఉందో చెప్పడానికి దొడ్డు బియ్యం వ్యవహారమే నిదర్శనమన్నారు. సన్న బియ్యం పంపిణీ మొదలుపెట్టాక, చిన్నగా ఉండే రేషన్ షాపుల్లో జాగా లేకపోయినా మూడు నెలల బియ్యం ఒకేసారి నిల్వ చేసి ఇవ్వమంటున్నారు. మరోవైపు గత 16, 17 నెలలుగా పాత దొడ్డు బియ్యం నిల్వలను అలాగే వదిలేశారు. గోదాములు, ఎంఎల్ఎస్ పాయింట్లలో లక్ష మెట్రిక్ టన్నులు, రేషన్ షాపుల్లో 40 నుంచి 50 వేల మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యం మూలుగుతోంది. దీని విలువ అక్షరాలా రూ. 600 కోట్లు! 16 నెలలుగా ఆ బియ్యం ముక్కిపోయి, ఎర్ర పురుగులు, లక్క పురుగులు పట్టి, ఎలుకలు, పందికొక్కులు తిని పిండిగా మారిపోయింది. సిద్దిపేటలో ఒక రేషన్ షాపుకు వెళ్లి చూస్తే పురుగులు బయటకు పారుతున్నాయి. ఆ పాడైపోయిన బియ్యాన్ని మనుషులే కాదు, బయట పారబోస్తే తిన్న పశువులు, కుక్కలు కూడా విషతుల్యమై చచ్చిపోయే పరిస్థితి వచ్చింది. మిలిటరీలో పనిచేశానని గొప్పలు చెప్పుకునే మంత్రికి, 16 నెలల క్రితమే ఆ బియ్యాన్ని వేలం వేసి అమ్మే కనీస తెలివి లేదా? ఆ బియ్యాన్ని అమ్మితే వచ్చే రూ. 600 కోట్లతోనే డీలర్ల కమిషన్ పెంపు, గౌరవ వేతనం ఇచ్చేయవచ్చు కదా! తమ నిర్లక్ష్యంతో రూ. 600 కోట్ల ప్రజాధనాన్ని పందికొక్కుల పాలు చేయడమే కాకుండా.. ఇప్పుడు టెండర్లు పిలిచి 16 నెలల క్రితం షాపులో ఉన్న స్టాక్ లెక్క ప్రకారం తూకం వేసి ఇవ్వాలని డీలర్లను వేధిస్తున్నారు. అసలే ఎంఎల్ఎస్ పాయింట్లలో తూకం తక్కువ వస్తుంటే, ఏడాదిన్నరగా ఎలుకలు, పురుగులు తిని తగ్గిన 5, 6 క్వింటాళ్ల తరుగును కూడా డీలర్లే జేబులోంచి కట్టాలనడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు.

కాంగ్రెస్ ప్రభుత్వ తప్పుడు నిర్ణయాల వల్ల సివిల్ సప్లైస్ కార్పొరేషన్ నేడు దాదాపు రూ. లక్ష కోట్ల అప్పుల్లో కూరుకుపోయింది.

సన్న బియ్యం నిధులు, సన్న వడ్ల బోనస్ డబ్బులు, గ్యాస్ సిలిండర్ సబ్సిడీ డబ్బులను రాష్ట్ర ప్రభుత్వం నెలనెలా కార్పొరేషన్‌కు విడుదల చేయకుండా కార్పొరేషన్‌నే అప్పులు తెచ్చుకోమంటోంది. గ్రామాల్లో మహిళలకు గ్యాస్ సబ్సిడీ ఒక నెల వేస్తే మూడు నెలలు ఎగ్గొడుతున్నారు. సివిల్ సప్లైస్ కార్పొరేషన్ బలంగా ఉంటేనే డీలర్లు బతుకుతారు, కార్పొరేషన్ దివాలా తీస్తే డీలర్లు కూడా ఆగమవుతారు. డీలర్లకు ఇవ్వడానికి ప్రభుత్వం దగ్గర డబ్బులు లేవా అంటే అదీ కాదు. రూ.లక్ష కోట్లతో మూసీ సుందరీకరణ, రూ. లక్ష కోట్లతో ఫ్యూచర్ సిటీ, రూ. 30 వేల కోట్లతో రోడ్లు అంటున్నారు. అందాల పోటీలకు, ఫుట్‌బాల్ షోకులకు నిధులుంటాయి. నాడు కేసీఆర్ గారు క్యాంప్ ఆఫీస్ కడితే విమర్శించిన రేవంత్ రెడ్డి నేడు రూ.100 కోట్లతో కొత్త క్యాంప్ ఆఫీస్ కట్టుకున్నారు. మరి రాష్ట్రంలోని 17,200 మంది డీలర్లకు నెలకు రూ. 5,000 గౌరవ వేతనం ఇస్తే అయ్యే ఖర్చు నెలకు రూ.10 కోట్లు కూడా కాదు. పేదల ఆకలి తీర్చే డీలర్లకు నెలకు రూ. 10 కోట్లు ఇవ్వడానికి మనసు రావడం లేదా? తక్షణమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించి డీలర్ల సంఘం రాష్ట్ర కార్యవర్గాన్ని చర్చలకు పిలవాలి. డీలర్లపై వేధింపులు ఆపి కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన రూ.5,000 గౌరవ వేతనం, రూ.300 కమీషన్, మినీ సూపర్ మార్కెట్ల హామీలను వెంటనే అమలు చేయాలి. డీలర్ల సమస్యలు పరిష్కారమయ్యే వరకు బీఆర్ఎస్ పార్టీ పూర్తి అండగా ఉండి అసెంబ్లీలో, మండలిలో ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తుందని హామీ ఇచ్చారు. సమావేశంలో రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయికోటి రాజు, ప్రధాన కార్యదర్శులు శ్రీకాంత్, ధరావత్ మోహన్ నాయక్, అజీజ్, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు నాగరాజు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నిర్లక్ష్యంతోనే కరువు

**మొదటిపేజీ తరువాయి**

ముఖ్యమంత్రిని ఎప్పుడు చేసుకుందామా అనే ఆలోచనలో ప్రజలు ఉన్నారన్నారు. చీకటిని చూస్తేనే వెలుగు విలువ తెలుస్తుందని వ్యాఖ్యానించారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో 24 గంటల ఉచిత విద్యుత్, సాగునీటి సదుపాయాలు అందించామని కేటీఆర్ గుర్తు చేశారు. రైతుబంధు, కేసీఆర్ కిట్, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి సంక్షేమ పథకాలతో ప్రజలకు అండగా నిలిచామన్నారు. కరోనా సంక్షోభ సమయంలోనూ రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి ఆదుకున్నామని తెలిపారు. కాంగ్రెస్ హామీలను నమ్మి ప్రజలు మోసపోయారని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే అన్ని హామీలను అమలు చేస్తామని చెప్పిన నాయకులు ఇప్పుడు వాటి అమలుపై ప్రశ్నిస్తే తప్పించుకునే ధోరణిలో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. హామీలు అమలు చేయలేకపోతే ఆ విషయాన్ని స్పష్టంగా చెప్పాలని, ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేయవద్దని హితవు పలికారు. మూడు నెలల్లోనే అన్నీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, మూడేళ్లు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. కరువు పరిస్థితులు ప్రకృతి వల్ల మాత్రమే ఏర్పడినవి కావని, నీటి నిర్వహణలో ప్రభుత్వ వైఫల్యమే ప్రధాన కారణమని కేటీఆర్ ఆరోపించారు. జూన్ 19న కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించినప్పుడు లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు ప్రవహిస్తోందని, పంపులు ఆన్ చేసి నీటిని ఎత్తిపోయాలని ప్రభుత్వాన్ని కోరామని గుర్తు చేశారు. అయినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదన్నారు. కాళేశ్వరం పంపులు ఆన్ చేస్తే ప్రాజెక్టుపై ఇంతకాలం చేసిన ఆరోపణలు తప్పని తేలిపోతాయనే భయంతోనే బటన్ నొక్కడం లేదని ఆరోపించారు. దేవుడు ప్రజల కోసం నీళ్లు పంపిస్తే మధ్యలో పూజారి రేవంత్ రెడ్డి అడ్డుపడి బటన్ నొక్కలేదని వ్యాఖ్యానించారు. గోదావరి నుంచి 750 టీఎంసీలు, కృష్ణా నుంచి 250 టీఎంసీల నీరు సముద్రంలోకి వెళ్లిందని తన ప్రసంగంలో పేర్కొన్నారు. ఈ నీటిని వినియోగించుకుని ఉంటే కోటి ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉండేదన్నారు. ఒకవైపు పంటలు కళ్ల ముందే ఎండిపోతుండటంతో రైతులు ట్యాంకర్ల ద్వారా నీటిని తెచ్చుకుని పంటలను కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. రైతుబంధు సకాలంలో అందడం లేదని, కరెంటు, యూరియా, సాగునీటి సమస్యలు మరింత తీవ్రంగా మారాయని విమర్శించారు. రైతుల కష్టాలను పరిష్కరించాల్సిన ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటనలకే ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు. నెలనెలా దిల్లీకి వెళ్లి ఈఎంఐ కట్టడానికే ఉన్నారని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి రెగ్యులర్ సీఎం కాదని, రెన్యువల్ సీఎం అని వ్యాఖ్యానించారు. రైతులకు రైతుబంధు పడకపోయినా రాహుల్ బంధు మాత్రం సమయానికి అందుతోందని వ్యంగ్యంగా అన్నారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీకి దోపిడీ వేదికగా మారిపోయిందని కేటీఆర్ ఆరోపించారు. దిల్లీలో బీజేపీ ప్రజలను విభజించడంలో బిజీగా ఉంటే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజలను దోచుకోవడంలో బిజీగా ఉందని వ్యాఖ్యానించారు.

**ఇక్కడ గెలిచిన వారు**
**నియోజకవర్గానికి ఏమి సాధించావారు**

నిర్మల్‌లో బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి, ఎంపీ గొడం నగేష్ గెలిచినా నియోజకవర్గానికి ఏమి సాధించారని ప్రశ్నించారు. నిర్మల్‌ను ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయడం, మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ, లిఫ్ట్ ఇరిగేషన్, మిషన్ భగీరథ, చెక్‌డ్యామ్‌లు, ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీల ఏర్పాటుకు బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేసిందని గుర్తు చేశారు. పదేళ్లు మంత్రిగా పనిచేసిన ఇంద్రకరణ్ రెడ్డి అధికారం కోల్పోగానే పార్టీని వీడారని విమర్శించారు. అవకాశవాదులు పార్టీని వీడినా పోరాటవాదులు బీఆర్ఎస్‌లోనే ఉన్నారన్నారు. తెలంగాణను ప్రస్తుత సంక్షోభం నుంచి బయటపడేయాలంటే కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని కేటీఆర్ అన్నారు. కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి అయితేనే తెలంగాణ మళ్లీ గట్టెక్కుతుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎక్కువ సమయం లేదని, మరో ఏడాదిలో రాజకీయ పరిస్థితులు మారుతాయని వ్యాఖ్యానించారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ మళ్లీ అభివృద్ధి, సంక్షేమ బాటలోకి వస్తుందని అన్నారు. నిర్మల్‌లో బీఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రామచరణ్ నాయకత్వంలో పార్టీ కార్యక్రమాలను విస్తరించాలని, యువ నాయకులు అనిల్ జాదవ్, జాన్సన్ రాథోడ్ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. నవంబర్ 11న నిర్మల్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ సభలో మరిన్ని చేరికలు ఉంటాయని వెల్లడించారు. పార్టీ కోసం కష్టపడుతున్న నాయకులు, కార్యకర్తలకు తగిన బాధ్యతలు అప్పగించే అంశంపై నిర్ణయం తీసుకుంటామన్నారు.

# 550 దిగ్గజ సంస్థలకు ఆహ్వానాలు

**హైదరాబాద్, అక్టోబర్ 27 :**

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో పాల్గొనాల్సిందిగా 550కిపైగా దేశీయ, అంతర్జాతీయ దిగ్గజ కంపెనీలను ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వెల్లడించారు. సమ్మిట్ నిర్వహణకు సంబంధించి వివిధ కమిటీల ద్వారా చేపడుతున్న ఏర్పాట్ల పురోగతిపై సచివాలయంలో మంగళవారం ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయి పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దడం, భారీ పెట్టుబడులను ఆకర్షించడం, పారిశ్రామిక అభివృద్ధికి కొత్త అవకాశాలను సృష్టించడం, యువతకు విస్తృతంగా ఉపాధి అవకాశాలు కల్పించడం లక్ష్యంగా ప్రభుత్వం ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026ను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. సమ్మిట్‌కు విస్తృత అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడంలో భాగంగా ఈనెల 29న దిల్లీలో కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పాల్గొంటారని, వివిధ దేశాల రాయబారులు, ప్రముఖ పారిశ్రామికవేత్తలు, దిగ్గజ కంపెనీల అధిపతులు, వివిధ రంగాల ప్రముఖులను ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. అంతర్జాతీయ పెట్టుబడిదారులతో సంబంధాలను బలోపేతం చేసుకోవడానికి, తెలంగాణలో అందుబాటులో ఉన్న పెట్టుబడి అవకాశాలను ప్రపంచానికి పరిచయం చేయడానికి ఈ కార్యక్రమం కీలక వేదికగా నిలవనుందన్నారు. ఇప్పటికే చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ నగరాల్లో సమ్మిట్ 2026పై రోడ్‌షోలను నిర్వహించినట్లు తెలిపారు. హైదరాబాద్‌లో జరగనున్న ప్రధాన సమ్మిట్‌కు 1,500కు పైగా కంపెనీలు, సంస్థల ప్రతినిధులను ఆహ్వానిస్తున్నామని చెప్పారు.

**రక్షణ, ఏరోస్పేస్ రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యం**

గ్లోబల్ సమ్మిట్‌లో భాగంగా నిర్వహించనున్న రక్షా ఎక్స్‌పోలో పాల్గొనేందుకు ప్రపంచవ్యాప్తంగా ఏరోస్పేస్, రక్షణ రంగాలకు చెందిన సుమారు 100 కంపెనీలు, సంస్థలను ఆహ్వానిస్తున్నట్లు ప్రధాన కార్యదర్శి తెలిపారు. ఆయా సంస్థలకు ఇప్పటికే ప్రత్యేక ఆహ్వానాలు పంపామని, ఆహ్వాన ప్రక్రియ కొనసాగుతోందని వెల్లడించారు.

**సమ్మిట్ నిర్వహణకు పటిష్ఠ ఏర్పాట్లు**

సమ్మిట్ జరిగే ప్రధాన వేదికను 25 సెక్టార్లుగా విభజించి ప్లీనరీ సమావేశాలు, సెమినార్లు, చర్చలు, ఒప్పందాల కార్యక్రమాలు, ఎగ్జిబిషన్లు, వివిధ కంపెనీలు, సంస్థల ప్రదర్శనలకు అవసరమైన వసతులను ప్రణాళికాబద్ధంగా ఏర్పాటు చేస్తున్నట్లు సీఎస్ తెలిపారు. రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు, కళా వైభవాన్ని ప్రతిబింబించేలా ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను కూడా నిర్వహించనున్నట్లు చెప్పారు. హాజరయ్యే దేశీయ, అంతర్జాతీయ ప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రవాణా, వసతి, సమావేశాల నిర్వహణతోపాటు అవసరమైన అన్ని ఏర్పాట్లను సమన్వయంతో చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ప్రతినిధికి సమన్వయ బాధ్యతలు నిర్వహించేందుకు ఒక సీనియర్ అధికారిని నోడల్ అధికారిగా నియమించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సమావేశంలో సీనియర్ అధికారులు నవీన్ మిట్టల్, హరిచందన, గౌరవ్ ఉప్పల్, సర్ఫరాజ్ అహ్మద్, కృష్ణ ఆదిత్య, అనుదీప్, శశాంక, కృష్ణ భాస్కర్, వల్లూరి క్రాంతి, అజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గ్లోబల్ సమ్మిట్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

**హైదరాబాద్, అక్టోబర్ 27:**

ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7 నుంచి నిర్వహించనున్న గ్లోబల్ సమ్మిట్‌ను ప్రతిష్ఠాత్మకంగా చేపట్టాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వివిధ దేశాలు, రాష్ట్రాల నుంచి హాజరయ్యే సీఈఓలు, ప్రతినిధులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమ్మిట్ సన్నాహాలపై మంగళవారం నిర్వహించిన సమీక్షలో ఆయన పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. నవంబర్ మొదటి వారంలోగా కార్యాచరణ ప్రణాళికలను ఖరారు చేయాలని స్పష్టం చేశారు.

ఈ నెల 29న ఢిల్లీలో నిర్వహించనున్న కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఎం సూచించారు. టెక్నాలజీ, ఫార్మా, ఏరోస్పేస్ తదితర రంగాల్లో తెలంగాణ సాధించిన ప్రగతిని ప్రపంచానికి పరిచయం చేసేలా హైదరాబాద్ నగరవ్యాప్తంగా ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. ఇందులో భాగంగా పలు ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొన్నారు. గ్లోబల్ సమ్మిట్ ద్వారా రాష్ట్ర ప్రతిష్ఠ అంతర్జాతీయ స్థాయిలో మరింత పెరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

క్లైమేట్ ఛేంజ్, కృత్రిమ మేధ (ఏఐ) రంగాలకు చెందిన అంతర్జాతీయ ప్రముఖులను సదస్సుకు ఆహ్వానించాలని సూచించారు. రక్షా ఎక్స్‌పో, ఇండియా జాయ్ కార్యక్రమాలు, ఔత్సాహిక పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలతో సమావేశాల నిర్వహణపైనా సమీక్షించారు. యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ (ఏవీజీసీ) రంగానికి సంబంధించి చేపడుతున్న ప్రత్యేక ఏర్పాట్లను అధికారులు వివరించారు. సమ్మిట్ ప్రాంగణంలో తెలంగాణ సంప్రదాయాలు, చారిత్రక వైభవం ప్రతిబింబించేలా డిజైన్లు రూపొందించాలని సీఎం సూచించారు. కాకతీయ కళాతోరణం, రామప్ప ఆలయ నమూనాలకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. బతుకమ్మ పండుగ విశిష్టతను విదేశీ అతిథులకు పరిచయం చేసేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు వివరించారు. ఈ సమావేశంలో సీఎస్ సంజయ్ జాజు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, టీజీఐఐసీ ఎండీ శశాంక, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణాదిత్య, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ బి. అజిత్‌రెడ్డి, ఐటీ శాఖ డిప్యూటీ సెక్రటరీ డి. అనుదీప్ పాల్గొన్నారు.

# తీరు మారకుంటే కఠిన చర్యలే

- భూ సమస్యల పరిష్కారంలో జాప్యాన్ని సహించను
- సర్వేను పరిశీలించి భూమి విస్తీర్ణంపై రైతులకు స్పష్టత ఇవ్వాలి
- పెండింగ్ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలి
- రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి

**సంగారెడ్డి/హైదరాబాద్, :**

రెవెన్యూ ఉద్యోగులు సక్రమంగా, బాధ్యతాయుతంగా పనిచేసినప్పుడే ప్రజల ముఖ్యంగా రైతుల సమస్యలు తీరుతాయని రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఈ విషయంలో ఇప్పటికే పలుమార్లు రెవెన్యూ ఉద్యోగులను ఆదేశించినప్పటికీ పూర్తిస్థాయి ఫలితాలు కనిపించలేదని, భవిష్యత్తులో మార్పు రాకపోతే అధికారులు, ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని రెవెన్యూ, రిజిస్ట్రేషన్, హౌసింగ్ శాఖల పనితీరుపై సంగారెడ్డి కలెక్టరేట్‌లో మంత్రి పొంగులేటి మంగళవారం సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతోపాటు భూ రికార్డుల్లో పారదర్శకత తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం రీ సర్వే చేపట్టిందన్నారు. భూ సర్వే నిర్వహణకు సంబంధించి పలువురు తహసీల్దార్లు, సర్వేయర్లతో ముఖాముఖి నిర్వహించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సర్వే కోసం ఎన్ని గ్రామాలను కేటాయించారు, ఇప్పటివరకు ఎన్ని గ్రామాల్లో సర్వే పూర్తయింది, ఏ విధంగా నిర్వహిస్తున్నారు, రోజుకు ఎన్ని ఎకరాల భూమిని సర్వే చేస్తున్నారు, సర్వే పూర్తికి ఎంత సమయం పడుతోంది తదితర అంశాలపై ఆరా తీశారు. సర్వే సమయంలో సంబంధిత రైతుకు తన భూమి ఎంత విస్తీర్ణంలో ఉందో స్పష్టంగా తెలియజేయాలని తహసీల్దార్లు, సర్వేయర్లకు సూచించారు. తహసీల్దార్ నుంచి జిల్లా కలెక్టర్ వరకు రెవెన్యూ అధికారులు సర్వే ప్రక్రియను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సర్వే పనుల పురోగతిని స్వయంగా పరిశీలిస్తూ రైతుల సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకోవాలని ఆదేశించారు. భూ సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా రైతులకు ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఏడాదిన్నరలోపు వ్యవసాయ భూములతోపాటు ఆబాదీ ఆస్తుల రీ సర్వేను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి చెప్పారు.




తొలి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో రీ సర్వే కొనసాగుతోందని, రీ సర్వే జరుగుతున్న గ్రామాల్లో కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించాలని సూచించారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల సాకారమయ్యే వరకు విడతలవారీగా ఇళ్ల మంజూరు కొనసాగుతుందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులపై నిర్మాణ వ్యయ భారాన్ని తగ్గించేందుకు సిమెంట్ బ్యాగ్‌ను కేవలం రూ.230కే అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

**డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల**
**నిర్మాణ పనులు వేగవంతం**

అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులు వేగవంతంగా, పూర్తి పారదర్శకంగా, అర్హత ప్రాతిపదికన జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమీక్షకు ముందు పలువురు ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గాల్లో నెలకొన్న భూ సమస్యలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులకు సంబంధించిన అంశాలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఆయా సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా కలెక్టర్లకు మంత్రి పలు సూచనలు చేశారు. సమావేశంలో ఎంపీలు రఘునందన్ రావు, సురేశ్ షెట్కర్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, సునీతా లక్ష్మారెడ్డి, మాణిక్‌రావు, కొత్త ప్రభాకర్ రెడ్డి, సంజీవరెడ్డి, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల కలెక్టర్లు ప్రతీక్ జైన్, హైమావతి, ప్రతిమా సింగ్‌లతోపాటు అదనపు కలెక్టర్లు, సబ్ కలెక్టర్, ఆర్డీవోలు, తహసీల్దార్లు, వివిధ శాఖల




## ఏఐ డేటా సెంటర్ల ఏర్పాటును నిలిపివేయాలి

- మానవ హక్కుల వేదిక డిమాండ్

**హైదరాబాద్, అక్టోబర్ 27 :**

రాష్ట్రంలో తీవ్రమవుతున్న నీటి సంక్షోభం, ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని భారీ స్థాయి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) డేటా సెంటర్ల ఏర్పాటును వెంటనే నిలిపివేయాలని మానవ హక్కుల వేదిక (హెచ్‌ఆర్ఎఫ్) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. డేటా సెంటర్ల వల్ల తాగునీరు, వ్యవసాయం, పర్యావరణానికి ఎలాంటి విఘాతం కలగదని పారదర్శకమైన అధ్యయనాలు నిర్ధారించే వరకు కొత్త హామీలను నిలిపివేయాలని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా మానవ హక్కుల వేదిక ప్రతినిధులు వి.ఎస్.కృష్ణ, ఎస్.జీవన్ కుమార్‌లు తమ ఆందోళనను వ్యక్తం చేస్తూ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో తీవ్ర నీటి కొరత ఉందని, రైతులు ఒక పంట కాలాన్ని వాయిదా వేసుకోవాలని, తాగునీటి సరఫరాకు హామీ ఇవ్వడం కూడా కష్టంగా ఉందని స్వయంగా ముఖ్యమంత్రి హెచ్చరిస్తున్నారని గుర్తు చేశారు. మరోవైపు హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు (హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ) నీటి అత్యవసర పరిస్థితిని ప్రకటించిందని, ఇలాంటి తరుణంలో భారీగా నీటిని వినియోగించే ఏఐ డేటా సెంటర్లను ప్రోత్సహించడం తీవ్ర వైరుధ్యంతో కూడుకున్న నిర్ణయమని వారు తెలిపారు. డేటా సెంటర్లలోని ప్రాసెసర్లను చల్లబరిచేందుకు అత్యాధునిక శీతలీకరణ వ్యవస్థలు అవసరమని, వీటి వినియోగానికి లక్షలాది లీటర్ల నీరు అవసరమవుతుందని తెలిపారు. 2029 నాటికి 5 గిగావాట్ల సామర్థ్యంతో డేటా సెంటర్లు ఏర్పాటు చేస్తే 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా కోసం గ్రిడ్‌పై తీవ్ర ఒత్తిడి పడుతుందని, దీనివల్ల గృహాలు, వ్యవసాయ రంగానికి విద్యుత్ కోతలు తప్పవని హెచ్చరించారు. భారీ మూలధనంతో ఏర్పాటు చేసే ఈ ప్రాజెక్టుల ద్వారా వచ్చే శాశ్వత ఉపాధి అవకాశాలు చాలా తక్కువ అని, కార్పొరేట్ సంస్థల విస్తరణ కోసం విలువైన ప్రకృతి వనరులను కేటాయించడం వల్ల కలిగే పర్యావరణ నష్టాన్ని చివరికి స్థానిక ప్రజలే భరించాల్సి వస్తుందని తెలిపారు. కాగా, ప్రతిపాదిత, ఉన్న అన్ని డేటా సెంటర్ల వనరుల వినియోగంపై పారదర్శకమైన, స్వతంత్ర అధ్యయనాలు నిర్వహించాలని హెచ్‌ఆర్ఎఫ్ కోరింది. ప్రజాభిప్రాయ సేకరణ జరిపి నీరు, విద్యుత్ వినియోగంపై కచ్చితమైన పరిమితులు విధించాలన్నది. సాంకేతిక రంగానికి పీఆర్ ప్రతిష్ఠ కంటే ప్రజల ప్రాథమిక అవసరాలైన తాగునీరు, వ్యవసాయానికే ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేసింది.

## ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానంటూ మహిళపై లైంగిక దాడి

**రంగారెడ్డి, అక్టోబర్ 27:**

మున్సిపల్ కార్యాలయంలో ఉద్యోగం ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి ఓ వివాహితను రిసార్ట్స్‌లోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడిన సంఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో సోమవారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ పి.కిరణ్ తెలిపిన మేరకు.. మల్లాపూర్‌కు చెందిన ఓ మహిళ (30) భర్తతో విడిపోయి టైలరింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తోంది. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరికి చెందిన జగన్మోహన్ మోత్కూరు మున్సిపాలిటీలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు.

ఇతడితో మహిళకు 4 నెలల క్రితం ఫోన్ ద్వారా పరిచయం ఏర్పడింది. తాను భువనగిరి మేనేజర్‌గా పని చేస్తానని, రూ.5 లక్షలు ఇస్తే మున్సిపల్ ఆఫీసులో ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికాడు. దీంతో ఆమె సోమవారం రూ.4.5 లక్షలు సిద్ధం చేసుకోగా, జగన్‌మోహన్ కారులో వెళ్లి మల్లాపూర్‌లో ఎక్కించుకుని భువనగిరికి బయలుదేరారు. ప్రయాణించే సమయంలోనే డబ్బు తీసుకొని కారులో భద్రపరుచుకున్నాడు. భువనగిరికి వెళ్లకుండా ఎదులాబాద్ డివిజన్ అవుషాపూర్ వద్ద శ్రీనిధి రిసార్ట్స్‌లోకి కారును మళ్లించగా బాధితురాలు అనుమానంతో ప్రశ్నించింది. డబ్బులు తీసుకునే అధికారి రిసార్ట్స్‌లో ఉన్నాడని బదులిచ్చాడు. లోపలికి వెళ్లిన అనంతరం రిసార్ట్స్‌లోని ఓ గదిలోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. అధికారిని కలుద్దామని ఆమె కోరడంతో కారులో ఎక్కించుకుని ఆమె ముఖంపై చేతులతో దాడి చేసి బయటకు తోసేసి వెళ్లిపోయాడు. బాధితురాలు 100కు డయల్ చేయగా ఘట్‌కేసర్ పోలీసులు వచ్చి భరోసా కేంద్రానికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు జగన్‌మోహన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## జవహర్‌నగర్ డంపింగ్ యార్డుపై పోరు

**హైదరాబాద్, అక్టోబర్ 27 :**

జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజల పక్షాన నిలిచి, యార్డును తక్షణమే తరలించాలని డిమాండ్ చేస్తూ మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ చేపట్టిన చలో జవహర్‌నగర్ మహా పాదయాత్రకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు సంపూర్ణ సంఘీభావం తెలిపారు. మంగళవారం ఉదయం ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువు వద్ద ప్రారంభమైన పాదయాత్రలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామచందర్ రావు మాట్లాడుతూ భవిష్యత్ తరాల ఆరోగ్యం, శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ఈ ప్రజా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో పాదయాత్ర చేపట్టిన ఈటలను అభినందించారు. గతంలో కొంపల్లి మోహన్ రెడ్డి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ)లో కేసు వేసినప్పుడు డంపింగ్ యార్డును తరలించడంతోపాటు శాస్త్రీయంగా క్యాపింగ్ చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని గుర్తు చేశారు. ఆ ప్రక్రియ ఏమైందో, నిబంధనలు ఎందుకు అమలు కావడం లేదో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. స్థానిక చెర్యాల, ఎదులాబాద్ పరిసర ప్రాంతాల్లో కాలుష్యం, దుర్గంధం వల్ల ప్రజలు అక్కడ నివసించలేని దుర్భర పరిస్థితులు నెలకొన్నాయని, భూగర్భ జలాలు విషతుల్యమైన కారణంగా ఎదులాబాద్ చెరువులోని చేపలను మార్కెట్‌లో ఎవరూ కొనుగోలు చేయని దయనీయ పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కాలుష్య ప్రభావం స్థానికంగానే కాక జూబ్లీహిల్స్, తార్నాక, ఉస్మానియా విశ్వవిద్యాలయం వరకు వ్యాపిస్తోందని తెలిపారు. దిల్లీలోని ఓఖ్లా వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌ను తాను పరిశీలించిన సందర్భాన్ని ప్రస్తావిస్తూ అక్కడ పారిశ్రామిక ప్రాంతమైనప్పటికీ నియమనిబంధనలకు లోబడి రాత్రివేళల్లో మాత్రమే వ్యర్థాలను తరలిస్తూ శాస్త్రీయ పద్ధతుల్లో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారని, పర్యావరణానికి ఇబ్బంది కలగకుండా నిర్వహిస్తున్నారని తెలిపారు. కానీ జవహర్‌నగర్ విషయంలో కనీస నిబంధనలు కూడా పాటించకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. దీనిపై ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ప్రశ్నించారు. ఈ సమస్య తీవ్రతపై ఎంపీ ఈటల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేసి నెల రోజులు గడిచినా ఎలాంటి స్పందన లేకపోవడం వల్లే ఇది ఉద్యమ రూపం దాల్చిందని స్పష్టం చేశారు. డంపింగ్ యార్డును పూర్తిగా మూసివేసి శాశ్వతంగా తరలించే వరకు ఈ ప్రజా పోరాటాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. అలాగే, రేవంత్ రెడ్డి ప్రభుత్వ వైఫల్యాలు, విచ్ఛిన్నకర విధానాలను ఎండగడుతూ 'సర'పై జరుగుతున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టి ప్రజలలో చైతన్యం కలిగించేందుకు నవంబర్ 2న ట్యాంక్‌బండ్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టనున్న మహా పాదయాత్రకు ప్రజలు, శ్రేణులు భారీ ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఇదే క్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదు ప్రక్రియను పార్టీ శ్రేణులందరూ చురుగ్గా ముందుకు తీసుకెళ్లాలని రామచందర్ రావు సూచించారు.

ఉద్యమ కెరటం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక



# సాంకేతిక ఆవిష్కరణల్లో భారత్‌దే నాయకత్వం

- అనుసరించే స్థాయి నుంచి సృష్టించే స్థాయికి
- యువ ఆవిష్కర్తల ఆత్మవిశ్వాసంపై మోదీ ప్రశంసలు
- ప్రపంచ సమస్యలకు స్వదేశీ పరిష్కారాలు
- 2.5 లక్షలకు చేరిన స్టార్టప్‌లు.. ఇన్నోవేషన్ సూచీలో మెరుగైన ర్యాంకు



**న్యూఢిల్లీ, అక్టోబర్ 27:**

సైన్స్, టెక్నాలజీ రంగాల్లో ప్రపంచానికి దిశా నిర్దేశం చేసే స్థాయికి భారత్ ఎదగాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆకాంక్షించారు. ఇతర దేశాలు అభివృద్ధి చేసిన సాంకేతికతను స్వీకరించే స్థాయి నుంచి ప్రపంచ సమస్యలకు సొంతంగా పరిష్కారాలు చూపించే స్థాయికి దేశం చేరుకుందని పేర్కొన్నారు. కొత్త సాంకేతికతల అభివృద్ధిలో భారత శాస్త్రవేత్తలు, యువ ఆవిష్కర్తలు మరింత చొరవ చూపాలని పిలుపునిచ్చారు. ఢిల్లీలోని భారత్ మండపంలో మంగళవారం నిర్వహించిన ఎమర్జింగ్ సైన్స్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ కాన్‌క్లేవ్-2026 (ఈఎస్‌టీఐసీ)ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా యువతలో కనిపిస్తున్న ఆత్మవిశ్వాసం, కొత్త ఆలోచనలు దేశ శాస్త్ర సాంకేతిక రంగంలో మార్పునకు నిదర్శనమని ప్రశంసించారు.

గతంలో ప్రపంచంలో కొత్త ఆవిష్కరణలు జరిగిన తర్వాత వాటిని భారత్ స్వీకరించేందుకు చాలా సమయం పట్టేదని మోదీ గుర్తుచేశారు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిందని, సాంకేతికతను ఉపయోగించుకోవడమే కాకుండా కొత్త ఆవిష్కరణలు చేపట్టి అంతర్జాతీయ సవాళ్లకు పరిష్కారాలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని వివరించారు. అంతరిక్ష రంగంలో సాధించిన విజయాలను ఇందుకు ఉదాహరణగా పేర్కొన్నారు. తొలి ప్రయత్నంలోనే అంగారకుడి కక్ష్యకు చేరుకోవడం, చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంతంలో విజయవంతంగా అడుగుపెట్టడం భారత శాస్త్ర సాంకేతిక సామర్థ్యానికి నిదర్శనమన్నారు. కొవిడ్ సమయంలో స్వదేశీ టీకాలను అభివృద్ధి చేసి విస్తృతంగా పంపిణీ చేయడంతో పాటు, అవసరమైన ఇతర దేశాలకు కూడా సరఫరా చేసిన విషయాన్ని ప్రస్తావించారు.

కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి జితేంద్ర సింగ్ మాట్లాడుతూ.. ప్రపంచ ఆవిష్కరణల్లో భారత్ పాత్ర గణనీయంగా పెరిగిందన్నారు. ఇతర దేశాలను అనుసరించే స్థాయి నుంచి అంతర్జాతీయ పరిశోధనలు, సాంకేతిక పరిష్కారాల రూపకల్పనలో భాగస్వామ్యం వహించే స్థాయికి ఎదిగిందని తెలిపారు. ప్రపంచ వేదికపై కొత్త ఆవిష్కరణలను సంయుక్తంగా సృష్టించే దేశంగా భారత్ రూపాంతరం చెందుతోందని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం తర్వాత భారత శాస్త్రవేత్తల్లో ప్రతిభ, కృషి ఉన్నప్పటికీ వారి సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటేందుకు అవసరమైన వనరులు, వ్యవస్థలు తగినంతగా లేవన్నారు. 2014 తర్వాత పరిశోధనలు, ఆవిష్కరణలకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించే దిశగా ప్రభుత్వం పలు విధానపరమైన చర్యలు తీసుకుందని వివరించారు. అంతరిక్షం, అణుశక్తి రంగాల్లో ప్రైవేటు సంస్థలకు అవకాశాలు కల్పించడం, అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ ఏర్పాటు పరిశోధనా వ్యవస్థకు బలాన్నిస్తున్నాయని జితేంద్ర సింగ్ తెలిపారు. గగన్‌యాన్, డీప్ ఓషన్ మిషన్, డిజిటల్ ఇండియా, బయోటెక్నాలజీ, స్టార్టప్‌ల అభివృద్ధి, స్వదేశీ కరోనా టీకా తయారీ వంటి కార్యక్రమాలు దేశ సామర్థ్యాన్ని చాటుతున్నాయని చెప్పారు.

దేశంలో స్టార్టప్‌ల సంఖ్య ఒకప్పుడు 350గా ఉండగా ప్రస్తుతం 2.5 లక్షలకు పెరిగిందని మంత్రి వెల్లడించారు. అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ 9 బిలియన్ డాలర్ల స్థాయికి చేరుకుందని తెలిపారు. గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్‌లో భారత్ ర్యాంకు 80 నుంచి 38కి మెరుగుపడిందని పేర్కొన్నారు. పరిశోధనలకు ప్రోత్సాహం, స్వదేశీ సాంకేతికత అభివృద్ధి, యువ ఆవిష్కర్తలకు అవకాశాల కల్పనతో భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు.

# పెళ్లి పేరుతో నమ్మించి.. నరకం చూపించాడు!

- భర్తతో పాటు ముగ్గురు స్నేహితులపై అత్యాచారం ఆరోపణలు
- ఇంట్లో బంధించి అఘాయిత్యాలకు పాల్పడినట్లు ఫిర్యాదు
- అద్దె కోసం వచ్చిన ఇంటి యజమానితో వెలుగులోకి ఘటన
- బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు



**హైదరాబాద్, అక్టోబర్ 27:**

పెళ్లి చేసుకుంటానని నమ్మించి భారత్‌కు తీసుకొచ్చిన యువతిని, వివాహం తర్వాత భర్తే తన స్నేహితులతో కలిసి వేధింపులకు గురిచేసినట్లు ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. మయన్మార్‌కు చెందిన 18 ఏళ్ల వివాహితను ఇంట్లో నిర్బంధించి, ఆమెపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. అక్టోబర్ 23న బకాయి అద్దె వసూలు చేసేందుకు వచ్చిన ఇంటి యజమాని తాళం పగులగొట్టి లోపలికి వెళ్లడంతో ఈ ఘటన బయటపడింది. బాధితురాలు హుమైరా తమన్నా ఫిర్యాదు ప్రకారం.. బంగ్లాదేశ్‌లోని కాక్స్ బజార్‌లో నివసిస్తున్న సమయంలో మహమ్మద్ ఫయాజ్ అనే వ్యక్తి ఆమెకు పరిచయమయ్యాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించిన అతడు, మే నెలలో కుటుంబ సభ్యులకు తెలియకుండా ఆమెను భారత్‌కు తీసుకొచ్చాడు. హైదరాబాద్‌కు చేరుకున్న మూడు, నాలుగు రోజుల్లోనే ఇద్దరూ వివాహం చేసుకున్నారు. పెళ్లయిన నెల రోజుల తర్వాత ఫయాజ్ మయన్మార్‌కు చెందిన తన ముగ్గురు స్నేహితులు అహ్మద్ ముజీబ్, నూర్ కమల్, జియాఉర్‌రెహమాన్‌లను ఇంటికి తీసుకొచ్చాడు. ఆ తర్వాత నుంచి తనను ఇంట్లోనే నిర్బంధించి, ఫయాజ్ బయటకు వెళ్లేటప్పుడు తాళం వేసి తన స్నేహితులను లోపలికి పంపేవాడని బాధితురాలు ఆరోపించింది. వారు తనపై అత్యాచారానికి పాల్పడేవారని ఫిర్యాదులో పేర్కొంది. ఈ విషయం బయటకు చెబితే చంపేస్తామని వారిలో ఇద్దరు బెదిరించారని తెలిపింది. భాష తెలియకపోవడం, సహాయం కోసం ఎవరిని సంప్రదించాలో అర్థంకాకపోవడం, నిందితుల బెదిరింపుల కారణంగా ఇన్నాళ్లూ మౌనంగా ఉండిపోయినట్లు వివరించింది. అక్టోబర్ 23న బకాయి అద్దె కోసం వచ్చిన ఇంటి యజమాని బయట నుంచి తాళం వేసి ఉండటాన్ని గమనించి దాన్ని పగులగొట్టి లోపలికి వెళ్లడంతో బాధితురాలు బయటపడింది. అనంతరం మరో వ్యక్తి మొబైల్ ఫోన్ సాయంతో బంగ్లాదేశ్‌లోని తన కుటుంబ సభ్యులకు సమాచారం అందించింది. వారి ద్వారా హైదరాబాద్‌లోని బంధువులకు విషయం తెలియడంతో బాధితురాలిని వారి ఇంటికి తీసుకెళ్లారు. అక్టోబర్ 26న బాధితురాలి బంధువు మహమ్మద్ రషీద్ ఆమెను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి ఫిర్యాదు చేయించారు. దీంతో భర్త మహమ్మద్ ఫయాజ్‌తో పాటు అతడి ముగ్గురు స్నేహితులపై అత్యాచారం, అక్రమ నిర్బంధం, క్రిమినల్ బెదిరింపుల ఆరోపణలతో పోలీసులు కేసు నమోదు చేశారు.

# మందుల ధరలపై సుప్రీంకోర్టు ఆగ్రహం

- రూ.11 వేల మందు రూ.1.30 లక్షలకు విక్రయం
- రూ.15 డ్రిప్ లైన్ ధర రూ.250
- ఎన్‌పీపీఏ పనితీరుపై ధర్మాసనం అసంతృప్తి
- రోగుల ప్రయోజ్యాల కంటే వ్యాపారాలకే ప్రాధాన్యమా?



**న్యూఢిల్లీ, అక్టోబర్ 27:**

ఔషధాల గరిష్ఠ చిల్లర ధర (ఎంఆర్‌పీ), రిటైలర్లు కొనుగోలు చేసే ధర మధ్య భారీ వ్యత్యాసాలు ఉండటంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఔషధ తయారీ సంస్థలకు ప్రయోజనం చేకూర్చేలా వ్యవస్థ పనిచేయడంపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసింది. మందుల ధరలను నియంత్రించాల్సిన నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ (ఎన్‌పీపీఏ) పనితీరు కూడా నిర్వీర్యమైన సంస్థను తలపిస్తోందని వ్యాఖ్యానించింది. మందుల ధరల నియంత్రణకు సంబంధించిన రెండు పిటిషన్లపై జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది.

రూ.11 వేలకే లభించే ఔషధాన్ని రూ.1.30 లక్షలకు విక్రయించడాన్ని ధరల సర్దుబాటుగా ఎలా సమర్థించుకుంటారని ధర్మాసనం ప్రశ్నించింది. రిటైలర్లు రూ.15కు కొనుగోలు చేసే డ్రిప్ లైన్‌ను రూ.250కు విక్రయిస్తున్న విషయాన్ని ప్రస్తావించింది. ఇంత భారీ వ్యత్యాసాలు కొనసాగుతున్నప్పుడు ఔషధ ధరల నియంత్రణ ఉత్తర్వు (డీపీసీవో) లక్ష్యం ఏమిటని నిలదీసింది. ధరల పెరుగుదలపై కేంద్రం ఇస్తున్న వివరణలు సంతృప్తికరంగా లేవని అభిప్రాయపడింది.

దేశంలో మందుల ధరలు ఇతర దేశాలతో పోలిస్తే తక్కువగానే ఉన్నాయని కేంద్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి వాదించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. తలసరి ఆదాయం తక్కువగా ఉన్న దేశంలో అంతర్జాతీయ ధరలతో పోల్చడం ద్వారా మందులు ప్రజలకు అందుబాటులో ఉన్నాయని నిర్ధారించలేమని స్పష్టం చేసింది. రోగుల అవసరాల కంటే వ్యాపార ప్రయోజనాలకు ప్రాధాన్యమివ్వడం సరికాదని పేర్కొంది.

ప్రైవేటు ఆసుపత్రుల తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపిస్తూ.. ఆసుపత్రుల నిర్వహణకు నిరంతర మౌలిక సదుపాయాలు అవసరమని, బయట కొనుగోలు చేసే మందుల్లో నకిలీవి ఉండే ప్రమాదం ఉందని తెలిపారు. అయితే, ఈ వాదనలతో ధర్మాసనం ఏకీభవించలేదు. వైద్య సేవలకు రుసుములు వసూలు చేయవచ్చని, కానీ మందుల కొనుగోలు ధరపై 100 నుంచి 200 రెట్లు అధికంగా వసూలు చేయడాన్ని ఎలా సమర్థించుకుంటారని ప్రశ్నించింది. నిర్వహణ ఖర్చుల కోసం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలే తప్ప, మందుల ధరల పెంపుతో రోగులపై భారం మోపకూడదని స్పష్టం చేసింది.

డీపీసీవో-2013 ప్రకారం షెడ్యూల్డ్ ఔషధాలపై ధరల పరిమితులు ఉన్నప్పటికీ, షెడ్యూల్‌లో లేని మందుల ప్రారంభ ధరలపై తగిన నియంత్రణ లేదని పిటిషనర్ కిషన్ చంద్ర జైన్ కోర్టుకు తెలిపారు. దేశంలో సుమారు 82 శాతం మందులు షెడ్యూల్ పరిధిలోకి రావని, వాటి ప్రారంభ ధరలను ముందుగానే నియంత్రించే విధానం లేకపోవడంతో తయారీ సంస్థలకు ఎంఆర్‌పీ నిర్ణయంలో అధిక స్వేచ్ఛ లభిస్తోందని వివరించారు.

క్యాన్సర్ ఔషధాల ధరల అంశంపైనా గతంలో సుప్రీంకోర్టు కేంద్రాన్ని ప్రశ్నించింది. అక్టోబర్ 12న జరిగిన విచారణలో క్యాన్సర్ మందులపై ట్రేడ్ మార్జిన్‌ను ఎంఆర్‌పీలో 30 శాతానికి పరిమితం చేయడంపై కేంద్రం ఇచ్చిన వివరణ పట్ల అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ పరిమితిని ఇతర ఔషధాలకూ ఎందుకు వర్తింపజేయలేదని నిలదీసింది. క్యాన్సర్ మందుల ట్రేడ్ మార్జిన్‌ను 30 శాతానికి పరిమితం చేయడం ద్వారా రోగులకు ఏటా సుమారు రూ.2,500 కోట్లు ఆదా అవుతాయని కేంద్రం అంచనా వేసింది. ఈ నేపథ్యంలో ఔషధ ధరల నియంత్రణ, రోగులకు అందుబాటు ధరల్లో మందుల లభ్యత అంశాలు మరోసారి ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# వోటు చోరీపై రాహుల్ గాంధీ ధ్వజం

- ఢిల్లీలో ప్రజా విచారణ
- నాలుగు పోలింగ్ కేంద్రాల్లో 416 పేర్లు తొలగించారని ఆరోపణ
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా వరకు పోరాటం
- 30న ప్రజా అభిశంసనకు అనుమతిపై వివాదం
- 1న రామ్‌లీలా మైదాన్ సభ అనుమతి కొనసాగుతుందన్న పోలీసులు



**తెలంగాణకు సంబంధించిన మరో అంశం**

తెలంగాణకు చెందిన సమాచార హక్కు కార్యకర్త ఎం.ఏ.ముజీబ్ అయ్యూబ్ 'సర్'లో ఉపయోగించే సాంకేతిక వ్యవస్థల వివరాలను కోరుతూ దాఖలు చేసిన ఆర్టీఐ దరఖాస్తుకు ఎన్నికల సంఘం ఇచ్చిన సమాధానం తాజాగా వెలుగులోకి వొచ్చింది. 'సర్' కోసం ప్రత్యేకంగా కొత్త సాఫ్ట్‌వేర్‌ను రూపొందించలేదని ఎన్నికల సంఘం పేర్కొంది. అయితే వోటర్ల వివరాల్లో వ్యత్యాసాలను గుర్తించేందుకు ఉపయోగించే సాంకేతిక పద్ధతులపై పూర్తి వివరాలు వెల్లడించలేదు.

**ఢిల్లీ/హైదరాబాద్, ప్రజాతంత్ర ప్రత్యేక వార్త |**

అక్టోబర్ 27 :వోటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ('సర్') పేరుతో అర్హులైన పౌరుల వోటు హక్కును హరిస్తున్నారని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మంగళవారం మరోసారి ఆరోపించారు. ఢిల్లీలోని త్రిలోక్‌పురి బ్లాక్-20లో నిర్వహించిన 'వోటు అధికార్, జీనే కా అధికార్' ప్రజావిచారణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఎన్నికల వ్యవస్థలో అత్యున్నత స్థాయి నుంచే అక్రమాలు జరుగుతున్నాయని విమర్శించారు. నాలుగు పోలింగ్ కేంద్రాల పరిధిలో 416 మంది వోటర్ల పేర్లను అక్రమంగా తొలగించారని రాహుల్ గాంధీ ఆరోపించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఈ ఆరోపణలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సీఈసీ రాజీనామా చేసే వరకు లేదా పదవి నుంచి తొలగించే వరకు ప్రతిపక్షాల ఉద్యమం కొనసాగుతుందని ప్రకటించారు. 30న ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై ప్రతీకాత్మక ప్రజా అభిశంసన నిర్వహించేందుకు ప్రతిపక్ష ఇండి కూటమి సిద్ధమవుతున్నది. ఢిల్లీలోని అశోక్ హోటల్‌లో నమూనా పార్లమెంట్ నిర్వహించాలని ప్రతిపాదించినప్పటికీ కార్యక్రమానికి అనుమతి లభించలేదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ మంగళవారం ఆరోపించారు. నిరసనలను అడ్డుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. అవసరమైతే కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాసాల వద్ద కూడా ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఢిల్లీ రామ్‌లీలా మైదాన్‌లో నవంబర్ 1న ఇండి కూటమి నిర్వహించనున్న భారీ సభకు గతంలో ఇచ్చిన పోలీసు నిరభ్యంతర పత్రాన్ని ఉపసంహరించలేదని ఢిల్లీ పోలీసులు మంగళవారం స్పష్టం చేశారు. 25 నుంచి నవంబర్ 3 వరకు మైదానం వినియోగానికి సంబంధించిన పోలీసు అనుమతి కొనసాగుతుందని వెల్లడించారు. అయితే సభ ఏర్పాట్ల పనులను పోలీసులు అడ్డుకుంటున్నారని వేణుగోపాల్ ఆరోపించారు. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా ఆదేశాల మేరకే ఈ చర్యలు జరుగుతున్నాయని విమర్శించారు. ఇండి కూటమి సభకు పది లక్షల మందిని సమీకరించాలని కాంగ్రెస్ లక్ష్యంగా పెట్టుకుంది. మంగళవారం జరిగిన సుప్రీంకోర్టు విచారణలో ఎన్నికల సంఘం తన నిర్ణయాలను సమర్థిస్తూ దాఖలు చేసిన 248 పేజీల అఫిడవిట్ కీలకంగా మారింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనల ధర్మాసనం ఎన్నికల సంఘం సమాధానంపై ప్రతిస్పందించేందుకు పిటిషనర్లకు పది రోజుల గడువు ఇచ్చింది. తదుపరి విచారణ నవంబర్ 17న జరగనుంది. ఎన్నికల సంఘం తన అఫిడవిట్‌లో 'సర్'కు సంబంధించిన నిర్ణయాలను ముగ్గురు కమిషనర్లు ఏకగ్రీవంగా ఆమోదించారని పేర్కొంది. ఫారం-6ను చట్ట విరుద్ధంగా మార్చారన్న ఆరోపణను తిరస్కరించింది. వోటర్ల పేర్లను చేర్చడం, తొలగించడం సంబంధిత ఎన్నికల నమోదు అధికారుల నిర్ణయాల ద్వారానే జరుగుతుందని వివరించింది. అయితే ఎన్నికల సంఘం అంతర్గత సమాచారాన్ని, నిర్ణయాలకు సంబంధించిన ఫైళ్లను భద్రపరచాలని రాహుల్ గాంధీ తరఫు న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీ కోరారు. ఈ పత్రాల ద్వారా నిర్ణయ ప్రక్రియలో సంప్రదింపులు జరిగాయో లేదో తెలుసుకోవచ్చని వాదించారు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ డోలా సేన్ దాఖలు చేసిన మరో పిటిషన్‌పైనా సుప్రీంకోర్టు ఎన్నికల సంఘం స్పందన కోరింది.

# ఎస్ఐఆర్‌పై ఈసీ అఫిడవిట్.. పది రోజుల గడువు

- ఈసీ అఫిడవిట్‌పై సమాధానానికి సుప్రీంకోర్టు ఆదేశం
- ఎస్ఐఆర్ చట్టబద్ధమేనని ఎన్నికల సంఘం స్పష్టీకరణ
- బిహార్‌లో ఫారం-6 మార్పులపై మరో పిటిషన్
- ఎన్నికల సంఘానికి ధర్మాసనం నోటీసులు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 27:**

ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ఎన్నికల సంఘం దాఖలు చేసిన అఫిడవిట్‌కు సమాధానం ఇచ్చేందుకు పిటిషనర్లకు సుప్రీంకోర్టు పది రోజుల గడువు ఇచ్చింది. ఎస్ఐఆర్ నిర్వహణ చట్ట నిబంధనలకు అనుగుణంగానే సాగుతోందని, ఈ ప్రక్రియకు సంబంధించిన నిర్ణయాలను ఎన్నికల సంఘంలోని ముగ్గురు సభ్యులూ ఏకగ్రీవంగా ఆమోదించారని ఈసీ తన అఫిడవిట్‌లో పేర్కొంది. మరోవైపు, బిహార్‌లో ఓటరు నమోదుకు ఉపయోగించే ఫారం6లో సుప్రీంకోర్టు అనుమతి లేకుండానే మార్పులు చేశారన్న ఆరోపణలపై దాఖలైన పిటిషన్‌పై కూడా ధర్మాసనం నోటీసులు జారీ చేసింది.

ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వీ. మోహనతో కూడిన ధర్మాసనం మంగళవారం ఈ ఆదేశాలు ఇచ్చింది. ఎన్నికల సంఘం సోమవారం రాత్రి దాఖలు చేసిన అఫిడవిట్‌పై పది రోజుల్లోగా ప్రత్యుత్తర అఫిడవిట్ సమర్పించాలని తొలి పిటిషనర్ రాకేశ్ కుమార్ సింగ్ తరఫున వాదిస్తున్న సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్‌ను ఆదేశించింది. ఈ వ్యవహారానికి సంబంధించిన అన్ని అంశాలను పరిశీలిస్తామని ప్రధాన న్యాయమూర్తి స్పష్టం చేశారు. రాజ్యసభ సభ్యురాలు దోలా సేన్ దాఖలు చేసిన పిటిషన్‌పై ఈసీతో పాటు ఇతర సంబంధిత పక్షాలకు నోటీసులు జారీ అయ్యాయి.

బిహార్ ఎస్ఐఆర్ సందర్భంగా ఫారం6లో మార్పులు చేశారంటూ దోలా సేన్ తన పిటిషన్‌లో ఆరోపించారు. ఆమె తరఫున సీనియర్ న్యాయవాది మేనకా గురుస్వామి వాదనలు వినిపిస్తూ.. ఫారం6లో మార్పులకు సుప్రీంకోర్టు అనుమతి ఉందని ఎన్నికల సంఘం తప్పుగా పేర్కొంటోందని తెలిపారు. అయితే, ఈ ఆరోపణలను ఈసీ ఖండించింది. ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు ఉపయోగించే చట్టబద్ధమైన ఫారం6లో ఎలాంటి మార్పులూ చేయలేదని 248 పేజీల అఫిడవిట్‌లో స్పష్టం చేసింది. ఎన్నికల సంఘం ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఆరోపణలు చేయడం విచారకరమని పేర్కొంది.




ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌తో పాటు ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై ఈసీ తన వాదనలను కోర్టుకు సమర్పించింది. ఎస్ఐఆర్ నిర్వహణకు చట్టబద్ధమైన అధికారం ఉందని, సంబంధిత ఉత్తర్వులను ముగ్గురు ఎన్నికల సంఘం సభ్యులూ ఏకగ్రీవంగా ఆమోదించారని తెలిపింది. అఫిడవిట్ దాఖలుకు కూడా ముగ్గురు సభ్యుల ఆమోదం ఉందని వెల్లడించింది. ఉప ఎన్నికల కమిషనర్ భాను ప్రకాశ్ యేతురు తరఫున ఈ సమాధానాన్ని దాఖలు చేసింది.

ఇదిలా ఉండగా, గత పది నెలల్లో ఎస్ఐఆర్‌కు సంబంధించిన నిర్ణయాలు, ఉత్తర్వులపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి కనీసం 14 సార్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు సెప్టెంబర్ 25న ప్రచురితమైన 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' కథనం వెల్లడించింది. కొన్ని నిర్ణయాలు తమకు తెలియకుండా లేదా తమ సిఫార్సులు లేకుండానే తీసుకున్నారని వారు అభ్యంతరం తెలిపినట్లు పేర్కొంది. ఈ కథనం వెలువడిన తర్వాత ఎన్నికల సంఘం పనితీరుపై ప్రతిపక్షాలు నిరసనలు చేపట్టాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలనే డిమాండ్లు కూడా తెరపైకి వచ్చాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ఎస్ఐఆర్ చట్టబద్ధత, ఫారం6లో మార్పుల ఆరోపణలు సుప్రీంకోర్టు విచారణలో కీలకంగా మారాయి.

ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక



# కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు సమష్టిగా కృషి చేయాలి

- రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ఉద్యమ కెరటం, ఖమ్మం:** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ రెడ్డి విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. అర్హులైన పట్టభద్రులందరినీ ఓటర్లుగా నమోదు చేయించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. మంగళవారం ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా రాంరెడ్డి సర్వోత్తమ రెడ్డిని ఏఐసీసీ, పీసీసీ ఎంపిక చేయడం మంచి నిర్ణయమని పేర్కొన్నారు. ఉన్నత విద్యావంతుడిగా, రాజకీయ కుటుంబ నేపథ్యం కలిగిన వ్యక్తిగా ఆయన పట్టభద్రుల సమస్యలను అర్థం చేసుకుని పరిష్కారానికి కృషి చేయ గలరని ఆశాభావం వ్యక్తం చేశారు. ఖమ్మం ప్రజలు తనను మెజారిటీతో గెలిపించిన విధంగానే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు తెలిపి భారీ మెజారిటీతో గెలిపించాలని పట్టభద్ర ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ప్రతి నాయకుడు, కార్యకర్త క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ అర్హులైన పట్టభద్రులను గుర్తించి ఓటర్లుగా నమోదు చేయించాలని సూచించారు. ఇతర జిల్లాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తున్న తీరుకు అనుగుణంగా ఖమ్మం జిల్లాలోనూ ఐక్యంగా ముందుకు సాగాలని అన్నారు. ఓటర్ల నమోదు నుంచి ఎన్నికల ప్రచారం వరకు ప్రతి అంశాన్ని ప్రణాళికాబద్ధంగా నిర్వహించి కాంగ్రెస్ అభ్యర్థి విజయమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

# బార్లపై వివక్ష ఎందుకు

- అందరికీ ఒకే నిబంధనలు అమలు చేయాలి

**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** బార్ల నిర్వహణ విషయంలో ప్రభుత్వం వివక్ష చూపుతోందని ఆరోపిస్తూ కాగజ్నగర్ పట్టణంలోని మూడు బార్ల యజమానులు, కార్మికులు మంగళవారం ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా బార్ల యజమానులు మాట్లాడుతూ పట్టణంలో బెల్టు షాపులు విచ్చలవిడిగా కొనసాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వైన్స్ దుకాణాల్లో పర్మిట్ రూమ్ల పేరుతో సిట్టింగ్లు నిర్వహిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు మౌనం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారం నిర్వహిస్తున్న బార్లపై మాత్రం వివిధ ఆంక్షలు విధిస్తూ అదనపు ఆర్థిక భారాన్ని మోపుతున్నారని పేర్కొన్నారు. బార్ల నిర్వహణకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పలుమార్లు ఎక్సైజ్ ఉన్నతాధికారులకు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ స్పందన రాలేదని తెలిపారు. సమస్య పరిష్కారం కోసం హైకోర్టును కూడా ఆశ్రయించినట్లు వివరించారు. బెల్టు షాపులు, వైన్స్లలో సిట్టింగ్ల విషయంలో ఒక విధంగా, బార్ల విషయంలో మరో విధంగా నిబంధనలు అమలు చేయడం ద్వారా తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నారు. అన్ని మద్యం విక్రయ కేంద్రాల విషయంలో ఒకే విధమైన నిబంధనలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బార్ల యజమానులు, కార్మికుల సమస్యలను ప్రభుత్వం,



ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు వెంటనే పరిశీలించి నిబంధనలను పునఃసమీక్షించి తమకు న్యాయం చేయాలని కోరారు.

# కలెక్టర్ ఆదేశాలను బేఖాతరు చేస్తున్న కాంట్రాక్టర్

- యూఐడీఎఫ్ పనులపై విచారణ జరిపించాలి: బీఆర్ఎస్ కౌన్సిలర్ల డిమాండ్



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** కాగజ్నగర్ పట్టణంలో యూఐడీఎఫ్ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులపై వివాదం నెలకొంది. పనులను నిలిపివేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినప్పటికీ 12వ వార్డులో కాంట్రాక్టర్ పనులు కొనసాగిస్తున్నారని బీఆర్ఎస్ కౌన్సిలర్లు పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తూ పనులు కొనసాగించడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 12వ వార్డులో చేపడుతున్న పనులపై జిల్లా కలెక్టర్ తక్షణమే సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ ఆదేశాలను ఉల్లంఘించినట్లు విచారణలో తేలితే సంబంధిత కాంట్రాక్టర్పై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారుల ఆదేశాలు అమలు చేయడంలో నిర్లక్ష్యం జరిగిందా..? లేనియెడల కాంట్రాక్టర్ నిబంధనలను ఉల్లంఘించి పనులు చేపడుతున్నారా.. అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని కోరారు. యూఐడీఎఫ్ పనుల విషయంలో పారదర్శకత పాటించి, ప్రజలకు వాస్తవాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు.

# స్పోకెన్ ఇంగ్లీష్తో ఆత్మవిశ్వాసం

- విద్యార్థుల్లో ఆంగ్ల భాషా నైపుణ్యాలను పెంపొందించాలి
- జిల్లా కలెక్టర్ రాజర్షిషా

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్ :** విద్యార్థుల్లో ఆంగ్ల భాషపై పట్టు పెంపొందించడంతో పాటు వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా సూచించారు. ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ నెలకు సంబంధించిన 'స్పోకెన్ ఇంగ్లీష్ రివ్యూ మీటింగ్ కమ్ కాంపిటీషన్స్'ను మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులతో మాట్లాడారు. నేటి పోటీ ప్రపంచంలో ఆంగ్ల భాషా సంభాషణ నైపుణ్యాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే ఇంగ్లీష్లో ధైర్యంగా, స్పష్టంగా మాట్లాడేలా ప్రోత్సహించాలని అన్నారు. పాఠశాలల్లో స్పోకెన్ ఇంగ్లీష్ బోధనను సమర్థవంతంగా అమలు చేస్తూ, విద్యార్థుల్లో ఆంగ్ల భాషపై ఉన్న భయాన్ని తొలగించి ఆత్మవిశ్వాసాన్ని పెంచాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆంగ్ల భాషా సామర్థ్యాలు, ఇప్పటివరకు సాధించిన పురోగతిపై సమీక్ష నిర్వహించారు.



అనంతరం వివిధ అంశాల్లో స్పోకెన్ ఇంగ్లీష్ పోటీలు నిర్వహించగా, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కలెక్టర్ అభినందించి, మరింతగా రాణించాలని ప్రోత్సహించారు. విజేతలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పాఠశాల జిల్లా కోఆర్డినేటర్ అజయ్, స్కూల్ అసిస్టెంట్లు రఘునాథ్, బాలాజీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# సొసైటీల అభివృద్ధికి పకడ్బందీ చర్యలు తీసుకోవాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్ :** సొసైటీల అభివృద్ధికి పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. జిల్లా కేంద్రంలోని డిసిసిబి బ్యాంకు ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన 99వ మహాజన సభ జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో సొసైటీల అభివృద్ధి, రుణాలు, ప్రభుత్వ పథకాల అమలుపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఇచ్చోడ, గుడిహత్నూర్, తాంసి, బజార్హత్నూర్ తదితర సొసైటీల పరిధిలో కనీసం 3 ఎకరాల భూసేకరణను పూర్తి చేసి మార్కెట్ యార్డులు, గోదాముల నిర్మాణానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సొసైటీల ఆధ్వర్యంలో సోలార్ విద్యుత్ కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా అదనపు ఆదాయం సమకూరుతుందని సూచించారు. అలాగే ప్రైవేట్ సంస్థలు, ఆసక్తిగల వ్యక్తుల



భాగస్వామ్యంతో పిఎం కుసుమ్ సోలార్ పంప్ సెట్ల పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. సొసైటీల్లో డిపాజిట్లను పెంచడంతో పాటు, ఎన్సిడిసి ద్వారా తక్కువ వడ్డీకి లభించే రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా స్థాయి ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో పెండింగ్లో ఉన్న చిన్నచిన్న సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని, అర్హులైన ప్రతిఒక్కరికీ మేలు జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఆర్ఎస్.చిత్రా, జిల్లా సహకార అధికారి సత్యనారాయణ, నాబార్డ్ డిడిఎం అబ్దుల్ రౌఫ్, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల సహకార శాఖ అధికారి కరుణాకర్, సిఈఓ చండీ, విశ్వేశ్వర్ రొడ్డ, సొసైటీల అధ్యక్షులు, బ్యాంకు అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# ప్రమాదంలో గాయపడిన జర్నలిస్టు పసీయుద్దీన్కు పర్మార్ష

**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఉద్యమ కెరటం పత్రిక నేరడిగొండ మండల రిపోర్టర్ షేక్ ఫసీయుద్దీన్ను మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, నాయకులు ఏలేటి రవీందర్ రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి విధుల్లో చేరాలని ఆకాంక్షించారు.

# తెలంగాణ రక్షణ సేన పార్టీలో చేరికలు



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మండలంలోని చించోలి గ్రామంలో తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షులు, బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావుకు పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు టీఆర్ఎస్ పార్టీలో చేరగా, బాపురావు వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి తగిన ప్రాధాన్యం ఉంటుందని, పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా ప్రజల మధ్య పనిచేయాలని సూచించారు. నాయకులు, కార్యకర్తలు ప్రజలతో మమేకమై పనిచేయాలని, గ్రామాల్లోని సమస్యలు, రైతుల ఇబ్బందులను ఎప్పటికప్పుడు నాయకత్వం దృష్టికి తీసుకురావాలని పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని, కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. చించోలిలో ఆయనకు లభించిన స్వాగతం, చేరికలతో స్థానికంగా టిఆర్ఎస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ బానోత్ వసంత్ రావు, ఆత్రం రఘునాథ్, మారుతి, గ్రామస్తులు, టిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సయ్యద్ సలీంకు ఉత్తమ రైతు అవార్డు

**రాశి సీడ్ కంపెనీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం**



**ఉద్యమ కెరటం, జైనూర్:** మండలంలోని జంగం గ్రామానికి చెందిన మసీదు సదర్ సయ్యద్ సలీం ఉత్తమ రైతు అవార్డును అందుకున్నారు. రాశి సీడ్ కంపెనీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు అవార్డు అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. వ్యవసాయ రంగంలో రైతుల కృషిని గుర్తించి, వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ అవార్డును అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. జంగం గ్రామానికి చెందిన సయ్యద్ సలీంకు ఉత్తమ రైతు అవార్డు లభించడం పట్ల గ్రామస్తులు, పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. ఆయనకు అభినందనలు తెలియజేస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జంగం ఉపసర్పంచ్ సయ్యద్ సజ్జద్ అలీ, రాశి సీడ్స్ ఆర్సీఎం కె. ప్రమోద్ కుమార్, డీలర్ డిస్ట్రిబ్యూటర్ కిశోర్ బివాజి, ఈఏఎస్వో శ్రీనివాస్, వార్డు సభ్యుడు లక్ష్మణ్, భగవత్ రావుతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు నేరడిగొండ విద్యార్థి ఎంపిక

- అండర్–17 పోటీల్లో ప్రతిభ.. ఈ నెల 27 నుంచి గద్వాల్లో రాష్ట్ర స్థాయి పోటీలు



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థి జి. విద్యావర్ధన్ రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల నిర్మల్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన అండర్–17 క్రికెట్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27 నుంచి 29 వరకు జోగులాంబ గద్వాల జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో విద్యావర్ధన్ పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల పాఠశాల ఉపాధ్యాయ బృందం, తోటి విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు.

# దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- **ఇచ్చోడ లేబర్ ఆఫీసులో భవన నిర్మాణ కార్మికుల వినతిపత్రం**

**ఉద్యమ కెరటం, ఇచ్చోడ:** దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మికులు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ అనుబంధ బీఓసీ మేస్త్రి భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఇచ్చోడ లేబర్ ఆఫీస్ జూనియర్ అసిస్టెంట్ మమతకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల లేబర్ కార్డుల రిజిస్ట్రేషన్లు, రెన్యూవల్స్ను వెంటనే పూర్తి చేయాలని కోరారు. కళ్యాణలక్ష్మి, డెలివరీ ప్రయోజనాలతో పాటు పెండింగ్లో ఉన్న డెత్ క్లెయిమ్లను త్వరిత గతిన పరిష్కరించాలని పేర్కొన్నారు. కార్మికులకు ఇబ్బందులు కలిగిస్తున్న 9 డేస్ ఫామ్ నిబంధనను వెంటనే తొలగించి, గతంలో మాదిరిగా సులభతర పద్ధతిలో రిజిస్ట్రేషన్లు, క్లెయిమ్లను ఆమోదించాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, ఐఎల్ఓ మండల కోఆర్డినేటర్ కల్లేపెల్లి గంగయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కీర్తి రమణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఇచ్చోడ మండల అధ్యక్షులు బోదాస్ రవి, తలమడుగు మండల అధ్యక్షులు ఆశన్న, కార్మికులు లక్ష్మణ్, మల్లేష్, సాయన్న, రవి, పద్మ, స్వామి తదితరులు పాల్గొన్నారు.



# తల్లి, బిడ్డల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ అవసరం

- **మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్**

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** తల్లి, బిడ్డల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ అవసరమని మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్ అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలో శ్రీ రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో గర్భిణీల కోసం నిర్వహించిన 'ఆర్యజనని–ధీరమానవుడిని తయారుచేసే ప్రయత్నం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లి, బిడ్డల ఆరోగ్యం, శ్రేయస్సు కోసం శ్రీ రామకృష్ణ సేవా సమితి ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. గర్భిణీలు ఆరోగ్యకరమైన పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు వైద్యుల సూచనలు పాటిస్తూ, తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఆరోగ్యవంతమైన తల్లి ద్వారానే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని అన్నారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులను తమ సొంత పిల్లలుగా భావిస్తూ ప్రేమతో, బాధ్యతతో సంరక్షిస్తున్న అంగన్వాడీ టీచర్లు, సిబ్బంది సేవలను అభినందించారు. చిన్నారుల ఎదుగుదలకు, ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాది వేయడంలో అంగన్వాడీ కేంద్రాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని తెలిపారు.



# రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి





**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. మంగళవారం నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో నిర్వహించిన రోడ్డు భద్రతా సమావేశంలో మాట్లాడారు. బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, బెల్లంపల్లి, జైపూర్ ఏసీపీలు, జాతీయ రహదారుల అధికారులతో కలిసి రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారులపై ఆక్రమణలు లేకుండా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. జాతీయ రహదారి-363పై వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు స్పీడ్ గన్లు ఏర్పాటు చేయాలని, ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో అవసరమైన స్పీడ్ బ్రేకర్లు, రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. రహదారులపై తగినంత వెలుతురు ఉండేలా లైటింగ్ సదుపాయాలను మెరుగుపరచాలని తెలిపారు. పశువుల సంచారం వల్ల ప్రమాదాలు జరగకుండా గోశాల ఏర్పాటు ప్రక్రియను పూర్తి చేసి అవసరమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. రవాణా శాఖ అధికారులు ఓవర్లోడ్ వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించే వాహనదారుల లైసెన్సులను అవసరమైన మేరకు సస్పెండ్ చేయాలని ఆదేశించారు. పాఠశాల బస్సుల ఫిట్నెస్ను క్రమం తప్పకుండా తనిఖీ చేయడంతో పాటు, ఫిట్నెస్ లేని వాహనాలను నడిపే వారిపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. బీమా లేకుండా తిరిగే వాహనాలపై జరిమానాలు విధించాలని సూచించారు. పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రిపుల్ రైడింగ్పై నిరంతరం తనిఖీలు నిర్వహించాలని, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మున్సిపాలిటీల పరిధిలో భవనాల సెల్లార్లను పార్కింగ్ అవసరాలకే వినియోగించేలా చర్యలు తీసుకోవాలని, రహదారులపై వాహనాల పార్కింగ్ను నియంత్రించి ట్రాఫిక్ సమస్యలను తగ్గించాలని సూచించారు. రోడ్డు భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ప్రతి శాఖ తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని, ప్రజల ప్రాణాలను కాపాడేందుకు ప్రమాదాల నివారణకు సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జనాభా గణన వివరాల నమోదులో తప్పులకు తావివ్వొద్దు

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** జనగణన–2027 రెండో దశలో భాగంగా నిర్వహించనున్న జనాభా గణనలో ప్రతి వివరాన్ని ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా స్పష్టంగా, ఖచ్చితత్వంతో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులకు సూచించారు. మంగళవారం నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని సమావేశ మందిరంలో జనగణన అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ముఖ్య ప్రణాళిక అధికారి పాపయ్య, డైరెక్టరేట్ ఆఫ్ సెన్సెస్ ఆపరేషన్స్ రాష్ట్ర కన్సల్టెంట్ కె.కృష్ణయ్య, మాస్టర్ ట్రైనర్ శరణ్యతో కలిసి శిక్షణ కార్యక్రమాన్ని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనగణన మొదటి దశలో గృహాల జాబితా తయారీ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసిన అధికారులు, సిబ్బంది రెండో దశలో జనాభా గణనను మరింత బాధ్యతాయుతంగా నిర్వహించాలని తెలిపారు. జిల్లా, మండల స్థాయి ఛార్జ్ అధికారులు జనగణనకు సంబంధించిన అన్ని అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, క్షేత్రస్థాయిలో ఎన్యుమరేటర్లకు అవసరమైన మార్గదర్శకాలు అందించాలని సూచించారు. జనాభా గణన ప్రశ్నావళిలోని ప్రతి ప్రశ్న ఉద్దేశాన్ని అర్థం చేసుకొని, సంబంధిత వివరాలను నిబంధనల ప్రకారం నమోదు చేయడంపై అధికారులు పట్టు సాధించాలని పేర్కొన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని, డెమో యాప్ వినియోగంపై పూర్తి అవగాహన పెంపొందించుకోవడంతోపాటు సందేహాలను అక్కడికక్కడే నివృత్తి చేసుకోవాలని సూచించారు. జనగణన ద్వారా సేకరించే వివరాలు 16వ ఆర్థిక సంఘం నిధులు, గ్రాంట్లు, గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలకు నిధుల కేటాయింపుల వంటి అంశాలకు ప్రాధాన్యం కలిగి ఉన్నందున సమాచార సేకరణలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. ఎన్యుమరేటర్లు ప్రతి ప్రశ్నను సంబంధిత వ్యక్తిని అడిగి, సమాధానాలను తప్పులు లేకుండా నమోదు చేయాలని ఆదేశించారు. మతం, కులం, వైవాహిక స్థితి, వివాహ సమయానికి వయస్సు, తల్లిదండ్రుల పేర్లు, పుట్టిన తేదీ, జన్మస్థలం, దివ్యాంగత్వం, అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత, ప్రస్తుతం విద్యాసంస్థల్లో చదువుతున్నారా లేదా, అత్యున్నత విద్యార్హత, విద్యా విభాగం తదితర వివరాలను ప్రశ్నావళి నిబంధనలకు అనుగుణంగా సేకరించాలని సూచించారు. ఏ ప్రశ్నను వదిలివేయకుండా ప్రతి వివరాన్ని స్పష్టంగా, బాధ్యతాయుతంగా నమోదు చేయాలని తెలిపారు. శిక్షణలో భాగంగా జనగణన శిక్షకులు జనాభా గణన ప్రశ్నావళిలోని వివిధ అంశాలు, వివరాల నమోదు విధానం, డెమో యాప్ వినియోగంపై అధికారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి పాపయ్య, రాష్ట్ర కన్సల్టెంట్ కె. కృష్ణయ్య, డీవైఎస్వో రాజేందర్, మాస్టర్ ట్రైనర్ శరణ్య, తహసీల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, సంబంధిత జనగణన అధికారులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందాలి

**మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్ (తాంసి):** ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందాలని ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. తాంసి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండల స్థాయి సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరు, ప్రజా సమస్యల పరిష్కారంపై వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని పేర్కొన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలను అర్హులైన ప్రతిఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ సమావేశంలో స్పెషల్ ఆఫీసర్ సతీష్ యాదవ్, మాజీ డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజా రెడ్డి, ఆత్మ చైర్మన్ కౌడాల నారాయణ, ఎంపీడీవో మోహన్ రెడ్డి, తహశీల్దార్ మధుసూదన్, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# ఏఐసీసీ అబ్జర్వర్, కోఆర్డినేటర్లకు ఘనస్వాగతం



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఓట్ బచావో – దేశ్ బచావో' అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయి కీలక సమావేశంలో పాల్గొనేందుకు మంగళవారం ఆదిలాబాద్ జిల్లాకు వచ్చిన ఏఐసీసీ అబ్జర్వర్ మురియప్పన్, కోఆర్డినేటర్ శ్రవణ్ కుమార్లకు జిల్లా కేంద్రంలోని పంచవటి హోటల్లో యువజన కాంగ్రెస్, ఎన్ఎస్యూఐ నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శంతన్ రావు, ఆదిలాబాద్ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు చరణ్ గౌడ్ ఓట్ బచావో – దేశ్ బచావో' ఉద్యమాన్ని జిల్లాలో ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంపై, రాబోయే రోజుల్లో యువత పోషించాల్సిన పాత్రపై ఏఐసీసీ నాయకులతో కీలక చర్చలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్యూఐ జిల్లా అధ్యక్షుడు కపిల్, బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోత రెడ్డి, ఆదిలాబాద్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు నాహిద్, ఉపాధ్యక్షులు రూపేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఏఐసీసీ అబ్జర్వర్లకు ఆడే గజేందర్ సన్మానం



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** డీసీసీ అధ్యక్షులు నరేష్ జాదవ్ ఆధ్వర్యంలో ఓటు బచావో – దేశ్ బచావో అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆదిలాబాద్ జిల్లాలో నిర్వహించిన కీలక సమావేశానికి హాజరైన ఏఐసీసీ ప్రతినిధులకు ఘనస్వాగతం లభించింది. జిల్లా కేంద్రంలోని పంచవటి హోటల్లో బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆడే గజేందర్ ఏఐసీసీ అబ్జర్వర్ మురియప్పన్, కోఆర్డినేటర్ శ్రవణ్ కుమార్లకు శాలువాలు కప్పి, ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బోథ్ నియోజకవర్గ ఇన్చార్జి ఆడే గజేందర్ మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు, ఓటు హక్కు రక్షణకు కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఓటు బచావో – దేశ్ బచావో' అభియాన్ ఎంతో కీలకమైందని పేర్కొన్నారు. జిల్లాలో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు బోథ్ నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు కదలివచ్చినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యలపై పోరాటాలకు ఏఐసీసీ అబ్జర్వర్ల సూచనలు, సలహాల మేరకు శ్రేణులను మరింత సన్నద్ధం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఏఐసీసీ ప్రతినిధుల రాకతో జిల్లా కాంగ్రెస్ శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహం నెలకొందని గజేందర్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఆడే గజేందర్ వెంట బోథ్ నియోజకవర్గానికి చెందిన ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు , కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆహార భద్రత చట్టం అమలుకు సమర్థవంతమైన చర్యలు

## జిల్లా అదనపు కలెక్టర్ రాములు



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** జిల్లాలో ఆహార భద్రత చట్టం 2006 అమలుకు అధికారుల సమన్వయంతో సమర్ధవంతమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని అదనపు కలెక్టర్ ఛాంబర్ నుంచి ఆహార భద్రత అధికారి వాసురామ్ తో కలిసి ఆహార భద్రత, ప్రమాణాల చట్టం 2006పై నిర్వహించిన ఆన్లైన్ శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా ఆహార భద్రత చట్టంలోని నిబంధనలు, ఆహార నాణ్యత ప్రమాణాలు, ప్రజారోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు, చట్టం అమలుకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ఆహార భద్రత చట్టాన్ని సమర్ధవంతంగా అమలు చేసేందుకు తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఆనంద్ కుమార్



**ఉద్యమ కెరటం, నర్సాపూర్:** తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మెదక్ జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పి.ఆనంద్ కుమార్ ఎన్నికయ్యారు. సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్‌లో మంగళవారం నిర్వహించిన రాష్ట్ర సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయనకు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయికోటి రాజు, ఆనంద్ కుమార్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. రాష్ట్ర స్థాయిలో కీలక బాధ్యతలు చేపట్టిన ఆనంద్ కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఉపాధ్యక్ష పదవిని అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు నాయికోటి రాజుకు, రాష్ట్ర నాయకులకు, సహచర రేషన్ డీలర్లకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను అంకిత భావంతో నిర్వహిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ డీలర్ల సంక్షేమానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను సంఘం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి నిరంతరం ప్రయత్నిస్తానని తెలిపారు. డీలర్ల హక్కుల పరిరక్షణకు కృషి చేయడంతో పాటు సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు కట్టుబడి పనిచేస్తానని స్పష్టం చేశారు. మెదక్ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్న ఆనంద్ కుమార్‌కు రాష్ట్ర స్థాయిలో కీలక బాధ్యతలు దక్కడం పట్ల జిల్లా రేషన్ డీలర్లు హర్షం వ్యక్తం చేశారు. ఆయన ఎన్నిక జిల్లా రేషన్ డీలర్లకు గర్వకారణమని పేర్కొంటూ అభినందనలు తెలిపారు. ఆయన నాయకత్వంలో డీలర్ల సమస్యల పరిష్కారానికి మరింత ప్రాధాన్యం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# పేకాట స్థావరంపై పోలీసుల దాడి



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా వేంసూరు మండల పరిధిలోని నాయకనగూడెం గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు మంగళవారం వేంసూరు ఎస్సై ప్రదీప్ సిబ్బందితో కలిసి దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఇద్దరు వ్యక్తులు పట్టుబడగా, మరికొందరు అక్కడి నుంచి పరారయ్యారు. పట్టుబడిన వారి వద్ద నుంచి 52 పేక ముక్కలు, రూ.3,200 నగదు, ఐదు ద్విచక్ర వాహనాలు, రెండు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి తదుపరి చర్యలు చేపట్టారు. పేకాట, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిఘా కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలు పెంపొందించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య
- ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య సూచించారు. మంగళవారం మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం నర్వ పరిధిలో పర్యటించిన ఆయన విద్య, అంగన్‌వాడీ సేవలు, పారిశుధ్యం, నీటి సంరక్షణ, గ్రామ పంచాయతీ భవన నిర్మాణం, అనధికార లేఅవుట్లకు సంబంధించిన అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా నర్వలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులను ప్రశ్నలు అడిగి నేర్చుకున్న అంశాలను తెలుసుకున్నారు. ఉపాధ్యాయులతో మాట్లాడి ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞాన కార్యక్రమాల అమలు, బేస్‌లైన్ పరీక్షల ఫలితాలు, విద్యార్థుల అభ్యసన పురోగతిపై వివరాలు సేకరించారు. బోధనలో వినియోగిస్తున్న అభ్యాసన సామగ్రిని పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు అందిస్తున్న సేవలు, పోషకాహార పంపిణీ, ఆహార తయారీ విధానాన్ని పరిశీలించారు. పిల్లలకు నాణ్యమైన పోషకాహారం అందించాలని, వంటగది, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ పాఠశాల వద్ద కమ్యూనిటీ సోక్‌పిట్ నిర్మాణానికి చేపట్టిన మార్కింగ్ పనులను పరిశీలించి, మురుగునీటి నిర్వహణకు అవసరమైన నిర్మాణాలను ప్రణాళికాబద్ధంగా చేపట్టి గ్రామంలో పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని అధికారులకు సూచించారు. నీటి వృథాను అరికట్టి తాగునీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, నీటి సంరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ నూతన భవనాన్ని సందర్శించి పరిపాలనకు అవసరమైన మౌళిక సదుపాయాలు, కార్యాలయ నిర్వహణకు సంబంధించిన అంశాలను పరిశీలించారు. గ్రామ పరిధిలోని అనధికార లేఅవుట్ల వివరాలను తనిఖీ చేసి, నిబంధనలకు అనుగుణంగా తదుపరి చర్యలు తీసుకునేలా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. భూ వినియోగం, లేఅవుట్లకు సంబంధించిన నిబంధనల అమలుపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి





- సమ్మె చేస్తున్న ఉద్యోగులకు ఎమ్మెల్యే హరీష్ బాబు సంఘీభావం

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగులను ప్రభుత్వం వెంటనే క్రమబద్ధీకరించాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు డిమాండ్ చేశారు. కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సముదాయం ఎదుట గత 15 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు సంఘీభావంగా ఆయన దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు గత 20 సంవత్సరాలుగా వైద్య ఆరోగ్య శాఖలో కీలక సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఇన్నేళ్లుగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ చాలీచాలని వేతనాలతో జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు వైద్య సేవలు అందించడంలో కీలకపాత్ర పోషిస్తున్న ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం గుర్తించి, వారి సేవలను క్రమబద్ధీకరించాలని కోరారు. రానున్న శీతాకాల అసెంబ్లీ సమావేశాల్లో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యను ప్రస్తావించి, వారి న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తానని హామీ ఇచ్చారు. దేశంలోని ఏడు రాష్ట్రాల్లో ఉద్యోగులను క్రమబద్ధీకరించిన విధానాలను పరిశీలించి, తెలంగాణలోనూ అదే తరహాలో చర్యలు చేపట్టేలా కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అరిగేల నాగేశ్వర్ రావు, మాజీ ఎంపీపీ అరిగేల మల్లికార్జున్ యాదవ్, ఆసిఫాబాద్ పట్టణ అధ్యక్షుడు ఆకుల సంతోష్ కుమార్‌తో పాటు పెద్ద సంఖ్యలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావంపై రైతులు అప్రమత్తంగా ఉండాలి

- వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలి
- ఏఎంసీ చైర్మన్ మీసం మహేందర్



**ఉద్యమ కెరటం,చిన్నకోడూరు:** ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలు ఉన్నందున రైతులు పంటల సాగు విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఏఎంసీ చైర్మన్ మీసం మహేందర్ సూచించారు. యాసంగి సీజన్‌లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటలను ఎంపిక చేసుకోవాలని, వరికి బదులుగా ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని ఆయన కోరారు. మంగళవారం చిన్నకోడూరు రైతు వేదికలో ఎల్‌నినో ప్రభావం, వ్యవసాయంపై దాని పరిణామాల గురించి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మీసం మహేందర్ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులు, భూగర్భ జలాల కొరత ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని రైతులు ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టాలన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని తెలిపారు.వాతావరణ పరిస్థితులు, నేల స్వభావం, అందుబాటులో ఉన్న నీటి వనరులను బట్టి పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. నీటి వినియోగాన్ని తగ్గిస్తూ తక్కువ నీటితో పండించే ఆరుతడి పంటలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి జయంత్, వ్యవసాయ విస్తరణ అధికారులు శ్రీకాంత్, నవీన్, డైరెక్టర్లు భూపతి రెడ్డి, సలీమ్, అశోక్, మహిపాల్ రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి సందబోయిన పరశురాం, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పొన్నాల రాజేష్, గొట్టిపర్తి చంద్, పంతం శ్రీనివాస్, అల్లీపూర్ ఉపసర్పంచ్ కొలన్‌పాక శ్రీనివాస్ రెడ్డి, శేఖర్, కోరిమి రాజు, రెడ్డి మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ ఉచ్చులో రైతు.. ఖాతా నుంచి రూ.1.20 లక్షలు మాయం..

- మిరుదొడ్డిలో ఘటన.. నగదు స్వాహా చేసిన సైబర్ నేరగాళ్లు
- పోలీస్ స్టేషన్ లో బాధితుడు ఫిర్యాదు
- కన్నీటి పర్యంతమైన రైతు
- సిమ్ బ్లాక్ చేసిన కేటుగాళ్లు

**ఉద్యమ కెరటం,దుబ్బాక ప్రతినిధి (మిరుదొడ్డి):** సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకున్న ఓ రైతు బ్యాంకు ఖాతా నుంచి సుమారు రూ.1.20 లక్షలు మాయమైన ఘటన సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం పెద్ద చెప్యాల గ్రామంలో చోటుచేసుకుంది. కష్టపడి వ్యవసాయం చేసుకుంటూ సంపాదించిన డబ్బు ఖాతా నుంచి మాయమవడంతో బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. గ్రామానికి చెందిన రైతు మంతూరి నరేష్(37) తెలిపిన వివరాల ప్రకారం తన బ్యాంకు ఖాతాలో రూ.1.30 లక్షలు ఉండగా, ఈ నెల 26వ తేదీన సాయంత్రం రూ.675 లావాదేవీ చేశాడు. అనంతరం ఖాతాలో కేవలం రూ.7 వేలే ఉన్నట్లు మెసేజ్ రావడంతో ఒక్కసారిగా కంగుతిన్నాడు. బ్యాంకు స్టేట్‌మెంట్‌ను పరిశీలించగా, ఈ నెల 25వ తేదీన పది సార్లు రూ.9,999 చొప్పున, 26వ తేదీన మరో రెండుసార్లు రూ.9,999 చొప్పున నగదు డ్రా అయినట్లు గుర్తించాడు. తన ఫోన్‌లో ఎలాంటి లింకులు ఓపెన్ చేయలేదని, ఎవరికీ ఓటీపీ కూడా చెప్పలేదని నరేష్ తెలిపారు. ఖాతాలోని నగదును సైబర్ నేరగాళ్లు కాజేసి, తన ఫోన్ సిమ్‌ను సైతం బ్లాక్ చేయడం జరిగిందన్నారు. వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్న తనకు ఈ ఘటన తీవ్ర ఆవేదన కలిగించిందని కన్నీటి పర్యంతమయ్యాడు.

### పోలీసులకు ఫిర్యాదు

ఖాతాలో నగదు మాయమైన విషయాన్ని గుర్తించిన బాధితుడు మంగళవారం ఉదయం సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు. అనంతరం బ్యాంకు స్టేట్‌మెంట్ ఆధారంగా మిరుదొడ్డి పోలీస్ స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. తనకు జరిగిన మోసం గురించి పోలీసులకు వివరించానని, తన నగదును తిరిగి ఇప్పించి, సైబర్ నేరగాళ్లపై చర్యలు తీసుకోవాలని బాధితుడు విజ్ఞప్తి చేశారు.





# పీఆర్జీటీఏ కరీంనగర్ జిల్లా నూతన కమిటీ ఏకగ్రీవం

## అన్ని యాజమాన్యాల గురుకుల ఉపాధ్యాయుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ పీఆర్జీటీఏ లక్ష్యం

**కరీంనగర్, అక్టోబర్ 27:** ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ గురుకుల టీచర్స్ అసోసియేషన్ (పీఆర్జీటీఏ) కరీంనగర్ జిల్లా నూతన కమిటీని 24 మంది సభ్యులతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లాలోని మైనారిటీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, జనరల్ గురుకుల సొసైటీలకు చెందిన ఉపాధ్యాయులతో నిర్వహించిన జిల్లా కమిటీ నిర్మాణ సమావేశంలో ఉపాధ్యాయుల సమస్యలు, హక్కులు, సంక్షేమం, పని ఒత్తిడి, పరిపాలనా అంశాలపై విస్తృతంగా చర్చించారు. కరీంనగర్ జిల్లా పి ఆర్ జి టి ఏ అధ్యక్షులుగా జై సింగ్, ప్రధాన కార్యదర్శిగా ఏ. రత్నాకర్, ఉపాధ్యక్షులుగా పి. వెంకట రామకృష్ణ, పి. సంపత్ ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా ఏం. శ్వేత,అసోసియేట్ అధ్యక్షులుగా ఏం. శ్రీకాంత్, బి. నవీన్,అదనపు ప్రధాన కార్యదర్శిగా జి. రాజేందర్, కార్యదర్శులుగా సౌజన్య, రఘుపతి ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా హరీష్,స్వప్న,బాబు, ఉపేందర్,సుజాత,మహేష్ రాహుల్,మధుసూదన్ రావు,సంతోష్ కుమార్, ప్రవీణ్ కుమార్, కుమారస్వామి, సంపత్ తదితరులు ఎన్నికయ్యారు. నూతన జిల్లా కమిటీ సభ్యులు మాట్లాడుతూ, కరీంనగర్ జిల్లాలోని అన్ని యాజమాన్యాల గురుకులాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ఐక్యంగా కృషి చేస్తామని తెలిపారు. అన్ని గురుకుల సొసైటీల ఉపాధ్యాయులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, వారి హక్కులు, సంక్షేమం, ఆత్మగౌరవం, సాధికారత కోసం నిరంతరం పనిచేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పీఆర్జీటీఏ రాష్ట్ర అధ్యక్షులు వేమిరెడ్డి దిలీప్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, గురుకుల విద్యా వ్యవస్థలో ఉపాధ్యాయులపై పెరుగుతున్న పని ఒత్తిడిని తగ్గించి, వారికి మెరుగైన పని వాతావరణాన్ని కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సంక్షేమం, ఆత్మగౌరవం, హక్కులు, సాధికారతకు ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. గురుకుల విద్యా వ్యవస్థ మరింత పటిష్టంగా, సమర్థవంతంగా అభివృద్ధి చెందాలంటే ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపడం అత్యంత అవసరమని ఆయన అన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం సంఘటితంగా ఉద్యమిస్తూ, ప్రభుత్వంపై ప్రజాస్వామ్యబద్ధంగా ఒత్తిడి తీసుకువస్తామని తెలిపారు. అన్ని యాజమాన్యాల గురుకుల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పి ఆర్ జి టి ఏ తన పోరాటాన్ని మరింత బలోపేతం చేస్తుందని రాష్ట్ర అధ్యక్షులు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం ప్రధాన డిమాండ్లను ప్రస్తావించారు.

### పీఆర్జీటీఏ మరింత బలోపేతం చేస్తాం

కరీంనగర్ జిల్లా నూతన కమిటీ ఏర్పాటుతో జిల్లాలోని అన్ని యాజమాన్యాల గురుకుల ఉపాధ్యాయులకు సంఘం మరింత చేరువవుతుందని రాష్ట్ర నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల సమస్యలను సమర్థవంతంగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి సమిష్టిగా కృషి చేస్తామని తెలిపారు. ఉపాధ్యాయుల ఐక్యతను బలోపేతం చేస్తూ, వారి సంక్షేమంతోపాటు గురుకుల విద్యా వ్యవస్థ అభివృద్ధికి పీఆర్జీటీఏ ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పి ఆర్ జి టి ఏ రాష్ట్ర నాయకులు గుర్రం రమేష్ గౌడ్, నిర్మలానందం,రామకృష్ణారెడ్డి, నాగేశ్వరరావు, పానుగంటి విజయ్, సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# త్రిష నవ్వు వెనుక మర్మమేమిటి?

## రాజకీయాల్లోకి ఎంట్రీపై ప్రశ్న..

## సమాధానం చెప్పకుండా చిరునవ్వు!

నవ్వు ఆరోగ్యానికి మంచిదని అంటారు. కానీ ఒక్కోసారి ఓ చిన్న నవ్వే పెద్ద చర్చకు దారితీస్తుంది. తాజాగా స్టార్ హీరోయిన్ త్రిష కృష్ణన్ విషయంలోనూ ఇదే జరిగింది. కోయంబత్తూర్‌లో ఓ మొబైల్ షోరూమ్ ప్రారంభోత్సవానికి హాజరైన ఆమె.. అక్కడ నిర్వహించిన రోడ్ షోలో సందడి చేశారు. త్రిషను చూసేందుకు అభిమానులు భారీగా తరలివచ్చారు. టాప్‌లెస్ వాహనంలో ప్రయాణిస్తూ అభిమానులకు అభివాదం చేసిన ఆమె సందడి ఇప్పుడు మరోసారి చర్చనీయాంశంగా మారింది. త్రిషకు ఉన్న క్రేజ్‌ను చూసి ఆమె రాజకీయాల్లోకి వస్తారనే ఊహాగానాలు మళ్లీ తెరపైకి వచ్చాయి. గతంలో తమిళనాడు రాజకీయాలు, నటుడు విజయ్‌తో ఆమెకున్న సంబంధాలపై పలు వదంతులు ప్రచారంలోకి వచ్చాయి. అయితే ఈ ప్రచారాలపై త్రిష నుంచి స్పష్టమైన ప్రకటన వెలువడలేదు. విజయ్‌తో కలిసి బహిరంగ కార్యక్రమాల్లో కనిపించడంపై కూడా గతంలో చర్చ జరిగింది. తాజాగా కోయంబత్తూర్ పర్యటనతో రాజకీయ ప్రవేశంపై ఊహాగానాలు మళ్లీ ఊపందుకున్నాయి. కోయంబత్తూర్ విమానాశ్రయంలో మీడియా ప్రతినిధులు రాజకీయాల్లోకి వస్తున్నారా? అని త్రిషను ప్రశ్నించినట్లు సమాచారం. అయితే ఆమె అవునని కానీ, కాదని కానీ చెప్పకుండా చిరునవ్వుతో స్పందించినట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో ఆ నవ్వు వెనుక అర్థమేమిటనే చర్చ మొదలైంది. అయితే త్రిష రాజకీయాల్లోకి వస్తున్నారనే విషయంపై ఇప్పటివరకు స్పష్టత లేదు. మరోవైపు త్రిష కొత్త సినిమాలను అంగీకరించే విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నారనే ప్రచారం కూడా సాగుతోంది. తనకు నచ్చిన పాత్రలు, మంచి కథలు వచ్చినప్పుడే సినిమాలకు అంగీకరిస్తున్నారా? లేక భవిష్యత్తు కోసం ఏదైనా ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నారా? అన్నది తెలియాల్సి ఉంది. తెలుగులో మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా నటిస్తున్న 'విశ్వంభర' చిత్రంలో త్రిష కథానాయికగా కనిపించనున్నారు. ఈ సోషియో-ఫాంటసీ చిత్రం విడుదల కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. మొత్తానికి, కోయంబత్తూర్‌లో త్రిష విసిరిన ఓ చిరునవ్వు ఆమె సినీ ప్రయాణంతో పాటు రాజకీయ ప్రవేశంపై కూడా కొత్త చర్చకు తెరలేపింది.



# అల్లు అర్జున్ అంటే క్రష్..

## 'నాకు భర్త కావాలంటే.. ఇవి ఉండాలి'

## యువ నాయిక రితికా నాయక్ ఆసక్తికర వ్యాఖ్యలు!

తెలుగు సినీ పరిశ్రమలో వరుస సినిమాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటోంది యువ కథానాయిక రితికా నాయక్. 'అశోకవనంలో అర్జున కల్యాణం', 'మిరాయ్' చిత్రాలతో ప్రేక్షకులకు దగ్గరైన ఈ ముద్దుగుమ్మ నేడు పుట్టినరోజు జరుపుకుంటోంది. ఈ సందర్భంగా గతంలో ఓ ఇంటర్వ్యూలో ఆమె వెల్లడించిన ఆసక్తికర విషయాలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. తనకు నచ్చిన హీరో ఎవరో చెప్పడంతో పాటు, తన జీవిత భాగస్వామిలో ఎలాంటి లక్షణాలు ఉండాలని కోరుకుంటుందో కూడా ఆమె వివరించింది. కథానాయికగా గుర్తింపు తెచ్చుకోవాలంటే అందం మాత్రమే సరిపోదని రితికా నాయక్ అభిప్రాయపడింది. తనను చూసి అందంగా ఉందని మాత్రమే కాకుండా, మంచి నటి అని కూడా ప్రేక్షకులు అనుకోవాలన్నదే తన లక్ష్యమని ఓ ఇంటర్వ్యూలో తెలిపింది. అన్ని రకాల పాత్రల్లో నటించాలని ఉందని, ఒకే తరహా పాత్రలకు పరిమితం కావడం తనకు ఇష్టం లేదని స్పష్టం చేసింది. తన క్రష్ ఎవరని అడిగినప్పుడు అల్లు అర్జున్ అంటే ఇష్టమని రితికా నాయక్ వెల్లడించింది. అదే సందర్భంలో తన జీవిత భాగస్వామి విషయంలోనూ తన అభిప్రాయాలను పంచుకుంది. తనను ఎంతో ప్రేమించే వ్యక్తి కావాలని, బంధంలో నమ్మకానికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపింది. తన వృత్తిని అర్థం చేసుకుంటూ, కెరీర్‌లో మరింత ముందుకు సాగేందుకు ప్రోత్సహించే వ్యక్తి భర్తగా రావాలని కోరుకుంటున్నట్లు పేర్కొంది. ఇక సినిమాల విషయానికొస్తే.. ఇటీవల 'కొరియన్ కనకరాజు'తో తెలుగు ప్రేక్షకులను పలకరించిన రితికా నాయక్ ప్రస్తుతం వరుస అవకాశాలతో బిజీగా ఉంది. వరుణ్‌తేజ్‌తో కలిసి 'డ్యూయెట్' చిత్రంలో నటిస్తోంది.

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**